విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, గురువారం 21, నవంబర్ 2024

## మాజీ ఎమ్మెల్యే జితేంద్ర గౌడ్‌కు ఆహ్వానం

**విశాలాంధ్ర-గుంతకల్లు:** పట్టణంలో భక్త కనకదాసు కాంస్య విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి గుంతకల్లు మాజీ శాసనసభ్యులు, తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్.జితేంద్ర గౌడ్ తన క్యాంప్ కార్యాలయంలో బుధవారం గుంతకల్లు నియోజక వర్గం కురుబ కులస్తులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పట్టణంలో బీరప్ప దేవాలయం వద్ద ఉదయం 10 గంటలకు జరగబోయే ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో గుంతకల్లు నియోజకవర్గం కురుబ సంఘాల నేతలు, తెదేపా శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ చార్జీలు తగ్గించేంత వరకు సిపిఐ ఉద్యమ కార్యాచరణ

### సిపిఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్

**విశాలాంధ్ర-అనంతపురం:** సర్దుబాటు చార్జీల పేరుతో పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించేవరకు సిపిఐ ఇతర వామపక్ష పార్టీలు కలిసి ఉద్యమ కార్యాచరణ రూపుదిద్దు కుంటున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి సి జాఫర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జగన్మోహన్ రెడ్డి, చంద్రబాబు ప్రధాని మోడీకి లొంగిపోయి, అదానితో లాలూచీపడి ప్రజలపై భారం వేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సర్దుబాటు చార్జీల పేరుతో ఇప్పటికే 6,072 కోట్లు వసూలు చేసేందుకు చార్జీలు పెంచి డిసెంబర్ నెల నుంచి వసూల్ చేయడానికి ప్రభుత్వం సిద్ధపడుతోందన్నారు. విద్యుత్ నియంత్రణ మండలి ప్రతిపాదనతో మరో రూ.11,820 కోట్ల ప్రజలపై భారం మోపడానికి పూనుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రజా సంఘాలు, వర్తక, వాణిజ్య సంఘాలు అభ్యంతరాలు తెలియజేసినప్పటికీ విద్యుత్ చార్జీలు పెంచడానికి తీవ్రమైన ప్రయత్నం చేస్తున్నారన్నారు. చంద్రబాబు నాయుడు ఎన్నికలలో ఇచ్చిన వాగ్దానాలు హామీలు గాలికొదిలి కరెంట్ చార్జీలు పెంచమని చెప్పి కరెంట్ చార్జీలు పెంచబోతున్నారు అని తెలిపారు. స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన తెలుగుదేశం పార్టీ, ఇప్పుడు అధికారంలో వచ్చిన తర్వాత స్మార్ట్ మీటర్లు పెట్టబోతు న్నారన్నారు. గోరుచుట్టుపై రోకటి పోటులాగా గృహ వినియోగదారులు ఆందోళన చెందుతున్నారన్నారు. ప్రభుత్వం తక్షణం విద్యుత్ చార్జీలను ఉపసంహరించుకోవాలన్నారు. బుధవారం నుండి ఈనెల 30 తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రజల్ని చైతన్యం చేస్తూ సభలు, సమావేశాలు, సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. డిసెంబర్లో ఉద్యమాన్ని ఉధృతం చేయడానికి వామపక్ష పార్టీలు మద్దతు తెలిపారు అన్నారు. ప్రజలపై భారం వేయకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీలు ఇచ్చి విద్యుత్ ఛార్జీలను ఉపసంహరించుకోవాలని సీపిఐ డిమాండ్ చేస్తోందన్నారు.

## శకుంతలమ్మ పార్థివ దేహానికి సిపిఐ ఘన నివాళులు..

### నిబద్ధత కలిగిన కమ్యూనిస్టు నాయకురాలు...

### సిపిఐ జిల్లా కార్యదర్శి సి జాఫర్

**విశాలాంధ్ర-అనంతపురం:** సిపిఐ సీనియర్ నాయకురాలు శకుంతలమ్మ మృతి మహిళా సమాఖ్య కార్మిక ఉద్యమానికి తీరని లోటు, నిబద్ధత కలిగిన నాయకురాలు అని సిపిఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్ పేర్కొన్నారు. బుధవారం శకుంతలమ్మ పార్థివ దేహానికి సిపిఐ నాయకులు ఘన నివాళు లర్పించారు. అనంతపురం సంగమేష్ నగర్ ఆమె నివాసం నుండి పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి శకుంతలమ్మ భర్త బుషేంద్ర బాబు, కుమారుడు రాజేష్, కుమార్తె హిమబిందు సిపిఐ నాయకులు ఆధ్వర్యంలో అనంతపురం వైద్య పరిశోధన నిమిత్తం ఆమె దేహాన్ని అనంతపురం మెడికల్ కాలేజీ అందచేశారు. సీపిఐ జిల్లా కార్యదర్శి జాఫర్ మాట్లాడుతూ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య మాజీ జిల్లా అధ్యక్షురాలు, ఏఐటియుసి మాజీ జిల్లా అధ్యక్షులు మాజీ గౌరవ అధ్యక్షులుగా వివిధ బాధ్యతల్లో పనిచేసిన కామ్రేడ్ శకుంతలమ్మ మంగళవారం మధ్యాహ్నం అనారోగ్యం తో మరణించారని తెలియజేయడానికి చింతిస్తున్నామన్నారు. 40 సంవత్సరాలుగా పీడిత ప్రజల కోసం, పార్టీలో వివిధ బాధ్యతలు తీసుకొని నిర్విరామంగా అలుపెరుగని పోరాటం చేసిన శకుంతలమ్మ భౌతికంగా ప్రస్తుతం మన మధ్య లేరన్నారు. శకుంత లమ్మ ఎగువ మధ్యతరగతి కుటుంబంలో జన్మించినా పేద ప్రజల పట్ల ఆప్యాయత చూపించేవారు అని పేర్కొన్నారు. మహిళా ఉద్యమాల్లో హుందాగా వ్యవహరించడం ఆమె నైజం అన్నారు. పార్టీ అభివృద్ధి,విస్తరణ గురించి తపన పడేవారన్నారు. కామ్రేడ్ శకుంతలమ్మ మరణం మహిళా సమాఖ్య,కార్మిక ఉద్యమానికి తీరని లోటన్నారు. శకుంతలమ్మ మృతి పట్ల వారి కుటుంబానికి సానుభూతిని సిపిఐ జిల్లా సమితి తరఫున తెలియజేశారు. ఆమె బ్రతికున్నంత కాలం సమాజం కోసం సేవ చేశారన్నారు. మరణించిన తర్వాత శకుంతలమ్మ పార్థివ దేహాన్ని మెడికల్ కళాశాలకు అప్పగించే కార్యక్రమాన్ని చేపట్టినందులకు కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పి.నారాయణస్వామి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాజారెడ్డి, సంజీవులు, సీనియర్ నాయకులు అమినమ్మ, జిల్లా కార్యవర్గ సభ్యులు లింగమయ్య, శ్రీరాములు,రమణ, బద్రి స్వామి, కేశవరెడ్డి, సంతోష్ కుమార్, రాజేష్, సిపిఐ నాయకులు అలిపిర నారాయణస్వామి, సుందరాజు, మల్లికార్జున, కృష్ణుడు మున్న గందిలింగప్పా జమీర్ ఏఐటీయూసీ రాజు, ఏఐవైఎఫ్ నాయకులు మోహన్ కృష్ణ, అశోక్ పాల్గొన్నారు.

## కడ్లే గౌరమ్మ... వెళ్లి రావమ్మ

**విశాలాంధ్ర-బొమ్మనహాళ్:** మండలంలోని గోవిందవాడ, కలవల్లి గ్రామాల్లో వీరభద్రస్వామి దేవాలయంలో మూడు రోజులుగా భక్తుల విశేష పూజలందుకున్న శ్రీ కడ్లే గౌరీదేవి బుధవారం తెల్లవారుజామున పూల రథోత్సవం కనుల పండువగా జరిగింది. మహిళలు, యువతులు, చిన్నారులు శనివారం రాత్రి కడ్లే గౌరమ్మకు కలశాలలో హారతులతో ఊరేగింపుగా వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం తెల్లవారుజాము నుంచి చక్ర హారతులు పట్టుకోగా అలంకరణ చేసిన గౌరీదేవిని పూలరథోత్సవంలో మేళతాళాలు, నంది ధ్వజములు, డోలు సన్నాయిలు వాయించుకుంటూ ఊరేగింపు చేశారు. అనంతరం పురాతన బావిలో కడ్లే గౌరమ్మను నిమజ్జనం చేశారు

## ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ట...

**విశాలాంధ్ర-కూడేరు:** మండల పరిధిలోని అరవకూరులో బుధవారం పురాతనమైన ఊరు గుట్ట ఆంజనేయ స్వామి దేవాలయం నందు ధ్వజస్తంభ ప్రతిష్టను అరవకూరు గ్రామానికి చెందిన పుట్టా చౌడన్న కుటుంబ సభ్యులు పుట్టా లక్ష్మీదేవి భర్త పుట్టా శ్రీనివాసులు, పుట్టా లక్ష్మీ భర్త పుట్టా లోకలు ఏర్పాటు చేశారు. ఆంజనేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేలాదిమంది బంధువులు, భక్తులు వచ్చారు. కార్యక్రమం నగేష్, మర్తాడు, తాతిరెడ్డిల ఆధ్వర్యంలో నిర్వహించారు.

## మహిళా చట్టాలపై అవగాహన సదస్సు

**విశాలాంధ్ర-ఆత్మకూరు:** ఆత్మకూరు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ జాతీయ మహిళా కమిషన్ ఆధ్వర్యంలో మహిళ న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. వివిధ గ్రామాల నుండి వచ్చిన మహిళలకు డిఎల్ఎస్ఎ జడ్జ్ సెక్రెటరీ శివప్రసాద్ యాదవ్ డిఎల్ ఎస్ ఏ న్యాయవాదులు పద్మజ హరికృష్ణ మహిళా చట్టాల గురించి గృహ హింస నిరోధక చట్టాల గురించి సమన్యాయం సమాన అవకాశాలు సమాన వేతనం తదితర వాటి గల చట్టాల గురించి మహిళలకు పూర్తి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ హేమలత, ఎంపీడీవో జీ లక్ష్మీనరసింహ, డిటి బాలమ్మ, ఎంఈఓ రామాంజనేయులు, ఏపీఎం పద్మావతి, ఐసిడిఎస్ లావణ్య, ఏపీవో సుజాత పాల్గొన్నారు.

## పదవి కాదు బాధ్యతగా పనిచేస్తా ..

**విశాలాంధ్ర-కళ్యాణదుర్గం టౌన్:** రాష్ట్ర వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ .. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్‌కు, ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబుకు ధన్యవాదాలు తెలిపారు. బుధవారంఆ పార్టీ నాయకులతో కలిసి వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం ప్రజా వేదికలో మాట్లాడుతూ రాష్ట్ర వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్‌ను పదవిగా కాకుండా బాధ్యతగా తీసుకొని ప్రతి ఒక్కరికి పని చేస్తానన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం సీనియర్ నాయకులు ఎర్రి స్వామి, మాజీ మున్సిపల్ చైర్మన్ బిక్కీ గోవిందప్ప రామలక్ష్మి, మాజీ కౌన్సిలర్ పూజారి ధనుంజయ, పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ కళాశాలలో స్కిల్ హవర్ ప్రారంభం

**విశాలాంధ్ర-ఉరవకొండ:** ఉరవకొండ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్కిల్ హవర్ ను ప్రవేశపెట్టినట్లు కళాశాల ప్రిన్సిపల్ ఆశ్రఫ్ అలీ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సాంకేతిక విద్యాశాఖ డైరెక్టర్ జీ.గణేష్‌కుమార్ ఆదేశాల మేరకు తరగతులు ప్రారంభించామన్నారు. స్కిల్ హవర్‌లో సాంకేతికపరమైన విప్లవాత్మక మార్పులపైన నైపుణ్యాలతో కూడిన స్టార్‌అప్ లను, వ్యాపార లావాదేవీలను, భారతదేశ ఆర్థిక ప్రగతి తదితర అనేక అంశాలపై నిపుణులతో తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల త్రిబుల్ ఈ శాఖ అధిపతి సురేష్ బాబు పాల్గొన్నారు.

## డిసెంబర్‌లో మెగా జాబ్ మేళా

**విశాలాంధ్ర-కళ్యాణదుర్గం:** యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా 200కుపైగా కంపెనీల్లో 20వేల ఉద్యోగాలు సమకూర్చడానికి డిసెంబర్ 13, 14 తేదీల్లో కళ్యాణదుర్గంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు కార్యాలయం ప్రతినిధులు పత్రిక ప్రకటన చేశారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు ఆధ్వర్యం లో కళ్యాణదుర్గంలో మొట్టమొదటిసారిగా మెగా జాబ్‌మేళా నిర్వహిస్తు న్నట్లు చెప్పారు. ఐదవ తరగతి నుంచి టెన్త్ క్లాస్, ఇంటర్మీడియట్, ఐటిఐ, డిగ్రీ బీటెక్ పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

**IN THE COURT OF THE 1ST ADDL DISTRICT JUDGE (M.A.C.T) WARANGAL**

O.P.NO.329 OF 2022
(OLD O.P. NO. 16 OF 2020

*Between :*

Banothu Kavitha & another ... Petitioners

And

Kodipally Sampath Rao & others .. Respondants

To

Respondents NO.3 : Kammari Muthyalappa S/o Not Known, age Major Occu : Driver of Crime Vechicle, R/o Kalyanadurgam, Kalyanadurg, Ananthapur Dist.,

Please take notice that the above case in O.P.No.329 Of 2022(new) old O.P.No.16 of 2020 on the file of Honble '1st ADDL District Judge Warangal Stands Posted, on 05-12-2024 for your appearance.

Your hereby requested to be present in the above court on the above date at 10.30 a.m.either in person or through councel or otherwise the matter will be decided againt you by sitting you as ex-parte.

Date : 20-11-2024
Place : Warangal
Hanamkonda.

LADE RAMESH
KISHTOJU SHIVA,
BAIKANI RAMESH,
KUSUMAMBA SHASHIDHAR,
ADVOCATES ,
H.N0.2-6-919/2, Circute House Road, KLN REDDY COLONY Hanamkonda City & Dist.
9849750190

## ఐఎఫ్‌టియూ నుండి మున్సిపల్ కార్మికులు ఏఐటీయూసీలోకి చేరిక

**విశాలాంధ్ర-అనంతపురం :** ముద్దలాపురం ఫిల్టరేషన్ ప్లాంట్ కార్మికులకు టిఏలు పెంచాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి డిమాండ్ చేశారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) కార్మిక సమస్యలపై నిర్వహిస్తున్న పోరాటాలు చూసి ఐఎఫ్ టి యూలో నుండి ఏఐటీయూసీ బుధవారం ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజారెడ్డి, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్ గౌడ్, ఏఐటియుసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కృష్ణుడు,మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు చిరంజీవి ఏఐటియుసిలో చేరుతున్న కార్మికులకు కండువాలు కప్పి సంఘంలోకి ఆహ్వానించారు. రాజారెడ్డి మాట్లాడుతూ ఎఐటియుసి అనుబంధ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ చేస్తున్న పోరాటాలు చూసి కార్మికులు ఏఐటియుసిలో చేరుతున్నా రన్నారు. నగరానికి సుదూర ప్రాంతం లో ఉన్న ముద్దలాపురం ఫిల్టరేషన్ ప్లాంట్‌లో రాత్రి, పగలు అని తేడా లేకుండా కష్టపడుతూ నగర ప్రజలకు తాగు నీటిని అందిస్తున్నా రన్నారు. ఇంత కష్టపడు తున్న కార్మికులకు మాత్రం కనీస వేతనాలు, ఇతర ఈపీఎఫ్ సమస్యలను పరిష్కరించడం లేదన్నారు. ముద్దలాపురంకు రావడానికి పోవడానికి ఇస్తున్న ట్రావలింగ్ అలవెన్సులు కూడా సరిగా ఇవ్వడం లేదని, టిఏలు కూడా పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూని యన్ జిల్లా సహాయ కార్యదర్శులు నాగరాజు, వేణుగోపాల్, సమితి సభ్యులు కుళ్ళాయి రెడ్డి,నారాయణ స్వామి,గిరి, ఏఐటియుసిలో చేరిన వారు రాజు, వెంకటరమణ, భాస్కర్, ఇర్ఫాన్, వీరాంజనేయులు, లక్ష్మినారాయణ, పెద్దన్న, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## క్రాప్ ఇన్సూరెన్స్‌ను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలి

**విశాలాంధ్ర - బుక్కరాయసముద్రం :** వ్యవసాయం అనేది ప్రకృతితో ముడిపడిన వృత్తి అని వ్యవసాయంలో వచ్చే నష్టాల నుంచి రైతులు గట్టెక్కడానికి ప్రతి చిన్న, సన్నకారు రైతు తప్పకుండా క్రాఫ్ట్ ఇన్సూరెన్స్ చేపించుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ రైతులను కోరారు. బుధవారం మండల కేంద్రంలోని సచివాలయంలో లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ సహకారంతో గ్రామస్థాయి జన సురక్ష అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ మాట్లాడుతూ సాగుకు వర్షాలె ఆధారమని అవే వర్షాలు విపత్తులను కూడా కలిగిస్తాయని, మరికొన్ని సందర్భాల్లో వర్షాభావ పరిస్థితుల వల్ల పంట ఎండిపోయి రైతులు అపారమైన నష్టాన్ని చవిచూసే పరిస్థితులు కూడా ఉంటాయన్నారు. వ్యవసాయంలో నష్టాల నుంచి రైతులు ఉపశమనం పొందడానికి ఈ భీమా ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. ఖరీఫ్ సీజన్లో సాగయ్యే పంటలకు కూడా పంటల బీమా వర్తిస్తుందన్నారు. కౌలు రైతులు కూడా పంటల భీమాను సద్వినియోగ చేసుకోవాలని కోరారు. ఈ సంవత్సరం జిల్లాలో పప్పు శెనగ సాగు విస్తీర్ణం పెరిగిందని అరటి విస్తీర్ణం తగ్గిందన్నారు. అరటి ,దానిమ్మ, బత్తాయి, టమోటా పంటలను సాగు చేస్తున్న రైతులు రబీలో తప్ప కుండా క్రాప్ ఇన్సూరెన్స్ చేయించు కోవాలన్నారు. పత్తి వేరుశనగ పంటలను పండించే రైతులు ఖరీఫ్ సీజన్లో భీమా చేయించుకోవాలని వివరించారు. సంవత్సరం బుక్కరాయ సముద్రం మండలం కూడా కరువు మండలాలు జాబితాలో ఉందన్నారు కృషి విజ్ఞాన కేంద్రం రెడ్డిపల్లి ప్రధాన శాస్త్రవేత్త మల్లీశ్వరి, రెడ్డిపల్లి వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త భార్గవి రైతుల సందేహాలు తీర్చారు.

## అన్నధాత సుఖీభవ కింద రూ.20వేలు అందించాలి

### జిల్లా రైతు సంఘం అధ్యక్షులు డి.చిన్నప్పయాదవ్

**విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం:** రైతులకు అన్నధాత సుఖీభవక్రింద రూ.20వేలు తక్షణమే అందించాలని జిల్లా రైతు సంఘం అధ్యక్షులు డి.చిన్నప్పయాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం ఏపి రైతు సంఘం అనంతపురం జిల్లాసమితి ఆధ్వర్యంలో రాష్టసమితి పిలుపు మేరకు కలెక్టర్ కార్యాలయం వద్ద రైతాంగసమస్యలపై నిరసన కార్యక్రమం తలపెట్టారు. జిల్లా రెవెన్యూ అధికారి మలోలకి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. జిల్లా వ్యాప్తంగా రబీలో పంటల సమయంలో చీడపీడలతో పంట చేతికి అందె పరిస్థితి లేదన్నారు. అరకోర వేరుశనగ, పత్తికి గిట్టుబాటు ధరలు లేవన్నారు. 2024 ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రతి రైతుకు రూ.20వేలు పెట్టుబడిసాయం అందిస్తా మని ప్రకటించారు. గత ప్రభుత్వ విధానాలవల్ల మన రాష్ట్రంలో ప్రతి రైతుకుటుంబంపై సుమారు 2 లక్షల 45 వేల రూపాయల రుణం ఉందన్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్ లో జిల్లాలో కరువు పరిస్థితి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఖరీఫ్ సీజన్లో సుమారు లక్షల ఎకరాల్లో రైతాంగం పంటలు వేయలేకపోయరన్నారు. రబీ సీజన్ ప్రారంభమైందని మీరు ప్రకటించిన రైతుకు రూ.20 వేల పెట్టుబడి సాయం ఇచ్చి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లారైతు సంఘం ఉపాధ్యక్షులు వెంకటరాముడు యాదవ్, కౌలురైతు సంఘం ప్రధాన కార్యదర్శి నీళ్ళపాల రామక్రిష్ణ, జిల్లారైతు సంఘం ఉపాధ్య క్షులు నాగేశ్, జిల్లా రైతు సంఘం నాయకులు, మధు యాదవ్, జిల్లాచేనేతసబ్ కమిటీ మెంబర్ చేనేతమధు, జిల్లా రైతు సంఘం నాయకులు లలితమ్మ, మన్నీల వెంకట రాముడు, బండివెంకటరాముడు, ఓబిరెడ్డి, ఆదినారాయణ, నారాయణస్వామి, రామాంజినేయిలు పాల్గొన్నారు.

## శకుంతలమ్మ మృతి పట్ల సంతాపం

**విశాలాంధ్ర-కళ్యాణదుర్గం:** మహిళా సమాఖ్య నాయకురాలు శకుంతలమ్మ మృతి పట్ల సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సంజీవప్ప బుధవారం సంతాపం తెలిపారు మహిళా నాయకురాలిగా శకుంతలమ్మ ఎన్నో పోరాటాలు చేశారని పేదల పట్ల ఆమెకున్న నిబద్ధత ప్రశంసనీయమని కొనియాడారు. అనంతపురానికి వెళ్లి శకుంతలమ్మ భౌతిక కాయానికి నివాళు లర్పించినట్లు ఆయన తెలిపారు.

## ఓపెన్ ఈస్ కర్రి కోసం టెండర్స్ ఆహ్వానం

**విశాలాంధ్ర-కణేకల్లు:** ఓపెన్ ఇస్ గా రిచ్ కోసం టెండర్స్ కనేకల్ మండలంలోని రచిమరి గ్రామంలోని ఓపనేశ్వరి తవ్వకం రవాణా నిల్వ ఇసుక లోడింగ్ కాంట్రాక్టు ఎంపీ కోసం ఆహ్వానం జిల్లా స్థాయి ఇసుక కమిటీ ఉపాన్నిస్కరించులో ఇసుకను త్రవ్వడం టోటల్ రవాణా కోసం ఇసుకను లోడ్ చేయడం కోసం ఏజెన్సీలు వ్యక్తుల నుండి టెండర్లను ఆహ్వానిస్తుందని అధికారులు తెలిపారు. కనేకల్లో బుధవారం శివ నారాయణ శర్మ ఐఏఎస్, జాయింట్ కలెక్టర్, రచుమర్రి ఇసుక రీచును సందర్శించారు. రచుమర్రి ఇసుక రీచు కోరకు టెండర్లు పిలవడం జరిగింది. జాయింట్ కలెక్టర్ గారి ఉన్నతో సహ వసంతబాబు, ఆర్డిఓ, కళ్యాణదుర్గం, వెంకటేశ్వర్లు, డిప్యూటీ డైరెక్టర్, గనుల శాఖ, ఫణి కుమార్, తహశీల్దారు, కణేకల్లు, శ్రీనివాసులు, ఎంపి డిఓ, కణేకల్లు, రచుమర్రి సర్పంచ్,హాజరయ్యారు.

## వాటర్ హార్వెస్టింగ్‌కు భూమి పూజ

**విశాలాంధ్ర-పామిడి:** రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్‌కు భూమిపూజ కార్యక్రమం చేశారు. పామిడి మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణంలో రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ పని కి బుధవారం భూమి పూజ కూటమి నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఈ కటడాల ద్వారా భూగర్భ జలాలు పెరుగుతా యన్నారు. తద్వారా నీటి ఎద్దడికి అవకాశం ఉండదని చెప్పారు. ప్రజలుకు వీటిపై అవగాహన కల్పించడం ద్వారా భవిష్యత్తు తరాలకు నీటి వనరులు పుష్కలంగా లభించే విధంగా చేయాలని సూచించారు. అలాగే పామిడి గ్రామ పంచాయతీలో పాత జాబ్ కార్డు ఉన్నచో ఆది యాక్టివేషన్ చేయించుకొని ఉపాధి పనికి రావాలన్నారు.

## మేధో సంపత్తి హక్కులపై అవగాహన

**విశాలాంధ్ర-అనంతపురం:** కేంద్రీయ విశ్వవిద్యాలయం మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో "మేధో సంపత్తి హక్కుల పట్ల అవగాహన: విద్యార్థులు తమ ఆలోచనలను పరిరక్షించడం వహించాల్సిన శ్రద్ధ" అనే అంశంపై బుధవారం ఒక రోజు కార్యశాల విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్. ఎ.కోరి ఆదేశాల ప్రకారం నిర్వహించారు. ఐపిఆర్ (ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్) ట్రిబ్ డైరెక్టర్ ఐపి బ్యాంక్ సిఇఒ అశోక్ దొప్పలపూడి వర్క్‌షాప్‌కు రిసోర్స్ పర్సన్‌గా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. ఔత్సాహిక భవిష్యత్ పారిశ్రామికవేత్తలు, ఆవిష్కర్తలకు వారి మేధో సంపత్తిని రక్షించుకోవడంలోగల ప్రాముఖ్యతను తెలియజేయడం లక్ష్యంగా ఈ కార్యశాల నిర్వహించబడిందన్నారు. విశ్వవిద్యాలయంలోని వర్ధమాన పారిశ్రామిక వేత్తలకు వారి ఆలోచనల, భవిష్యత్ ప్రాజెక్టుల అభివృద్ధిలో ఐపిఆర్ పరిజ్ఞానం వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేయడంలో ఇటువంటి అవగాహన కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగ పడతాయన్నారు. కన్వీనర్‌గా జి.మాలతి, సహ కన్వీనర్ ఎంఎస్ఆర్ అంజనేయులు వ్యవహరించారు.

## లబ్ధిదారులకు త్వరలో నగదు జమ

**విశాలాంధ్ర-రాప్తాడు:** ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇల్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు త్వరలో పెండింగ్ బకాయిలు జమవుతాయని టీడీపీ మండల కన్వీనర్ పంపు కొండప్ప, ప్రధాన కార్యదర్శి దగ్గుపాటి శ్రీనివాసులు అన్నారు. ఎంపీడీఓ బి.విజయలక్ష్మి తెలిపారు. బుధవారం రాప్తాడు ఎంపీడీవో కార్యాలయంలో లబ్ధిదారులకు వర్క్ ఆర్డర్ ను అందజేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ పీఎంఏవై పథకం కింద ఇల్లు మంజూరైన వారికి ఉపాధి హామీ పథకం కింద 90 రోజుల కూలీ పనులు కల్పిస్తారన్నారు. పోర్టల్‌లో నమోదు చేసి బిల్లులు మంజూరు అవుతాయన్నారు. 180 మంది లబ్ధిదారులకు బిల్లులు పెండింగ్ ఉన్నాయన్నారు హౌసింగ్ ఏఈ లావణ్య, ఏపీఓ సావిత్రి పాల్గొన్నారు.

## నిరుద్యోగులకు ఉపాధి కల్పించే జాకీ పరిశ్రమను మళ్లీ తీసుకురండి

### -అసెంబ్లీలో ఎమ్మెల్యే పరిటాల సునీత

**విశాలాంధ్ర-రాప్తాడు:** నిరుద్యోగులకు ఉపాధి కల్పించే జాకీ పరిశ్రమను మళ్లీ తీసుకురావా లని, గతంలో అప్పటి ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి సోదరులు రూ.15కోట్ల కోసం జాకీని తెలంగాణకు వెళ్ళిపోయేలా చేశారని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. బుధవారం అసెంబ్లీ ఆమె మాట్లాడారు. సీఎం చంద్రబాబు కృషి వలన జాకీ సంస్థ రాప్తాడు సమీపంలో పరిశ్రమ ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చిందన్నారు. 2017లో పరిశ్రమ ఏర్పాటు కోసం 27 ఎకరాలను ఏపీఐఐసీ ద్వారా ఉత్తర్వులు ఇచ్చారన్నారు. రూ.129 కోట్లు పెట్టుబడి పెట్టి ఏటా 32.4 మిలియన్ల దుస్తులను తయారు చేసే పరిశ్రమ పనులు కూడా 2018లో ప్రారంభించారన్నారు. కాంపౌండ్ వాల్ నిర్మాణం పూర్తి చేసి.. మిషనరీలను కూడా తీసుకొచ్చిన సమయంలో మాజీ ఎమ్మెల్యే, ఆయన సోదరుల నిర్వాకంతో పరిశ్రమ తెలంగాణకు తరలిపోయిందన్నారు. ఈ పరిశ్రమ వలన సుమారు 6వేల మందికి ప్రత్యక్షంగా 4వేల మందికి పరోక్షంగా ఉపాధి కల్పించే అవకాశాన్ని కోల్పోయామన్నారు. జాకీ పరిశ్రమ మళ్లీ ప్రారంభించాలని టీడీపీతోపాటు సీపీఐ నాయకులు కూడా చలో జాకీ పరిశ్రమ కార్యక్రమాన్ని నిర్వహిస్తే.. పోలీసులు చేత అక్రమంగా అరెస్టులు చేయించారన్నారు. ప్రకాష్ రెడ్డి ప్రోద్భలంతో నాతో పాటు పరిటాల శ్రీరామ్, సీపీఐ రామకృష్ణ, మరో 40మంది టీడీపీ, సీపీఐ నాయకులపై అక్రమంగా కేసులు పెట్టించారన్నారు. ఆ రోజు ఎన్ని ప్రయత్నాలు చేసిన జాకీని తిరిగి తీసుకొచ్చే ప్రయత్నం చేయకపోగా.. వేరే గార్మెంట్స్ పరిశ్రమలు తీసుకొస్తామని ప్రగల్భాలు పనికి ఒక్క పరిచయం కూడా తీసుకురాలేకపోయారన్నారు. చంద్రబాబు మళ్లీ సీఎం అయిన నేపథ్యంలో గతంలో ఇచ్చిన ప్రోత్సాహకాలు కొనసాగిస్తూ.. జాకీ పరిశ్రమ తిరిగి వచ్చేలా చూడాలన్నారు. సభ అనంతరం స్పీకర్ ఛాంబర్లో పరిటాల శ్రీరాంతో కలసి భారీ, చిన్న తరహా పరిశ్రమల శాఖల మంత్రులు టి.జి. భరత్, కొండపల్లి శ్రీనివాస్ కు జాకీ పరిశ్రమను తిరిగి రప్పించాలని పరిటాల సునీత వినతిపత్రం అందజేశారు. ఈ విషయాన్ని సీఎం దృష్టికి ఈ తీసుకెళ్తామన్నారు.

## గుత్తి సిఐకు ఉత్తమ సేవలకు పురస్కారం

**విశాలాంధ్ర-గుత్తి:** పట్టణం పోలీస్ స్టేషన్ పరిధిలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న సీఐ వెంకటేశ్వర్ల కు బుధవారం ఎస్పీ కార్యాలయంలో ఉత్తమ సేవలకు గుర్తింపుగా ఎస్పీ జగదీష్ చేతుల మీదుగా ప్రశంస పత్రాన్ని అందుకున్నారు. గుత్తి సీఐ వెంకటేశ్వర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

## త్వరలో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సహకారంతో జాబ్ మేళా

**విశాలాంధ్ర-ఉరవకొండ:** నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఆయన సోదరుడు పయ్యావుల శ్రీనివాసులు సహాయ సహకారా లతో త్వరలోనే జాబ్ మేళా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు టిడిపి పార్టీ నాయకులు తెలిపారు. బుధవారం ఉరవకొండలో విలేకరులతో మాట్లాడుతూ వివిధ పేరెన్నికగన్న కంపెనీలు ఈ జాబ్ మేళాలో పాల్గొంటారని టెన్త్, ఇంటర్, ఐటిఐ, డిగ్రీ, బి.టెక్, పీజీ,ఎంబీఏ, ఎంసీఏ, ఎంఎస్సి తదితర విద్యా అర్హతలు కలిగిన వారు బయోడేటాను ఫోన్ నెంబర్ 9502236524కు వాట్సప్ ద్వారా వివరాలు పంపవచ్చు అని తెలిపారు. జాబ్‌మేళా కార్యక్రమాన్ని ఎక్కడ నిర్వహించేది వేదిక తేదీలను త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు.

## బంధువుల ఊరికి వెళ్లి తిరిగి వస్తూ తిరిగిరాని లోకాలకు

**విశాలాంధ్ర-శింగనమల:** బంధువుల ఊరికి వెళ్లి తిరిగి వస్తుండగా విద్యుత్ వైర్లు తెగిపడి తండ్రి కొడుకులు మృత్యువాత పడిన సంఘటన ఎల్లనూరు మండలం దంతాలపల్లి గ్రామ సమీపంలో జరిగింది. పుట్లూరు మండలం మడుగుపల్లి గ్రామానికి చెందిన పూజారి రామాంజనేయులుతండ్రి ఇద్దరూ కలిసి ద్విచక్ర వాహనంపై వస్తుండగా యల్లనూరు మండలం దంతలపల్లి గ్రామ సమీపంలో విద్యుత్ లైన్ తెగి ద్విచక్రవాహంలో వస్తున్న వారిపై పడి అక్కడికక్కడే తండ్రి కొడుకులు మృతి చెందారు, వీరు కడప జిల్లాలోని లింగాల మండలం అంకెవారిపల్లి గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా ఈ సంఘటన జరిగింది. గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

## ముగిసిన గ్రంథాలయాల వారోత్సవాలు

**విశాలాంధ్ర-శెట్టూరు:** విద్యార్థులు యువత పుస్తకాలు చదవడం నేర్చుకోవాలని గ్రంథాలయ అధికారి రజిని సూచించారు. బుధవారం మండల కేంద్రంలో గ్రంథాలయం శాఖ ఆధ్వర్యంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సర్పంచ్ కుమార్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ వారం రోజుల నుంచి గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నామని, విద్యార్థి యువత పుస్తకాలు చదవడం అలవర్చుకోవాలన్నారు. డ్రాయింగ్ ఆటల పోటీలు నిర్వహించి జ్ఞానవి వికాస్ స్కూల్ ప్రిన్సిపల్ ఖాదర భాష చేతులమీదుగా బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు మల్లికార్జున, చెన్నారెడ్డి,గోపి పాల్గొన్నారు.

## గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు.

**విశాలాంధ్ర-తాడిపత్రి:** ప్రతి విద్యార్థి గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకొని, విజ్ఞానాన్ని సంపాదించుకోవాలని గ్రంథాలయ అధికారి రవికుమార్ సూచించారు. బుధవారం స్థానిక గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిలుగా ఎంఈఓ నాగరాజు రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు జి.ఆదినారాయణ స్వామి రిటైర్డ్ స్కూల్ అసిస్టెంట్ బి.వెంకటరామయ్య రిటైర్డ్ ఉపాధ్యాయులు వీరారెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ పి.కాశీ విశ్వనాథ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ చినిగిన చొక్కా అయినా తొడుక్కో - ఒక మంచి పుస్తకం కొనుక్కో అని, ఒక మంచి మాటతో పుస్తకం విలువను, పుస్తకం ఆవశ్యకతను గురించి తెలుపుతూ - పుస్తకము ఒక మంచి నేస్తం అన్నారు. గ్రంథాలయ వారోత్సవాలలో నిర్వహించిన పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

## గుత్తి మోడల్ స్కూల్‌లో ఆపార్ సేవలు

**విశాలాంధ్ర-గుత్తి:** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా ఆపార్ కార్డు ప్రక్రియలో భాగంగా విద్యార్థుల సౌలభ్యం కోసం గుత్తి మునిసిపల్ కమీషనర్ బి.జబ్బార్ మియా ఆధ్వర్యంలో స్థానిక మోడల్ స్కూల్లో ప్రిన్సిపల్ అధ్యక్షతన బుధవారం ప్రత్యేక ఆధార్, బర్త్ అండ్ డెత్, పేరు సరిదిద్దుబాట్లు, విద్యార్థుల సంబంధిత సేవలను అందించడానికి సచివాలయ సిబ్బంది ద్వారా ప్రత్యేక కౌంటర్‌ను నిర్వహించారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్, విద్యా సిబ్బంది, స్కూల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు. తమ సౌలభ్యం కొరకు తమ స్కూల్ వద్ద ప్రత్యేల సేవా కేంద్రం ద్వారా సేవాలందించిన మునిసిపల్ కమిషనర్‌కు సచివాలయ సిబ్బందికి స్కూల్ విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

## జెసి.ప్రభాకర్ రెడ్డి నమ్మకాన్ని వమ్ము చేయను

**విశాలాంధ్ర-తాడిపత్రి:** మున్సిపల్ చైర్మన్ జెసి.ప్రభాకర్ రెడ్డి నాపై నమ్మకం ఉంచి తనను మాల కార్పొరేషన్ డైరెక్టర్‌గా నన్ను నియమించినందుకు ముఖ్యమంత్రికి, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు విద్యాశాఖ మంత్రి లోకేష్‌కు జెసి.ప్రభాకర్ రెడ్డికి కొంకరి కమలమ్మ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం ఎస్సీ మాల కార్యాలయం వద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వంలో తాను జైల్లో ఉన్నప్పుడు జేసీ ప్రభాకర్ రెడ్డికి అబ్రాడ్‌లో తన మనవరాలు పెళ్లి ఉన్నప్పటికీ తనను జైల్లో నుంచి బయటికి తీసుకువచ్చి తను రక్షించిన గొప్ప వ్యక్తి అన్నారు. అంతటి మహానుభావుడు నమ్మకాన్ని వమ్ము చేయకుండా తాడిపత్రి ప్రాంతానికి, జేసీ ప్రభాకర్ రెడ్డి, జేసీ అస్మిత్ రెడ్డికి ఎలాంటి కలంకం రాణికుండా తాడిపత్రిని రాష్ట్రంలో ఒక బ్రాండ్‌గా చేస్తానన్నారు.

## జగనన్న లేఔట్‌లపై సీఐడి విచారణపై హర్షం

**విశాలాంధ్ర -రాయదుర్గం :** రాయదుర్గం నియోజకవర్గంలో జగనన్న లేఔట్ లో జరిగిన అవకతవకలపై ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు సిఐడి విచారణ కోరడం హర్షించదగ్గ విషయం అని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిందనూరు నాగరాజు బుధువారం ఒక్క పత్రికా ప్రకటనలో తెలిపారు, ఎమ్మెల్యే కాలువ శ్రీనివాస్ ఈరోజు అసెంబ్లీలో జగనన్న లేఔట్ లో అవకతవకలు గురించి ప్రభుత్వ ఇళ్ల స్థలాలకి భూమిని విక్రయించిన రైతులకు బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని అసెంబ్లీలో మాట్లాడారని హర్షం వ్యక్తం చేశారు. బహుజన సమాజ్ పార్టీ ఉద్యమానికి తోడ్పడిన ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులకు కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా రాయదుర్గంలో జరుగుతున్న అక్రమ మైనింగ్, అక్రమ మట్టి, ఇసుక వీటి పైన కూడా అసెంబ్లీలో మాట్లాడి సిఐడి విచారణ జరిపించి. సహజ వనరులను జాతీయ సంపదను కూడ కాపాడాలని కోరారు,అక్రమ మైనింగ్ పై కూడా అసెంబ్లీలో విచారణ కోరాలని డిమాండ్ చేస్తున్నామని అయన తెలిపారు.

## ఇంటి స్థలాలు ఇవ్వాలని సిపిఐ ఆధ్వర్యంలో నిరసన...

**విశాలాంధ్ర-నంబులపూలకుంట :** మండలంలో ఇల్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలాల పట్టాలు ఇవ్వాలని సిపిఐ మండల కార్యదర్శి జి.రమణ ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ నరేంద్ర కుమార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్యదర్శి జి రమణ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం పేద వారి ఇంటి కొరకు ఒకటిన్నర సెంటు నివాసయోగ్యం కాని ప్రదేశంలో పట్టా ఇచ్చిందని,ఇంటి నిర్మాణం కొరకు డబ్బులు మంజూరు చేయలేదని పేర్కొన్నారు. గత సార్వత్రిక ఎన్నికల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతి పేదవారికి మూడు సెంట్ల ప్రభుత్వ భూమిలో ప్రభుత్వ ఖర్చుతో ఇంటిని నిర్మించి సొంతింటి కలను నెరవేరుస్తానని హామీ ఇచ్చారని, ఇచ్చిన హామీ మేరకు మండల కేంద్రంలో మూడు సెంట్లు ఇంటి స్థలాలు ఇవ్వాలని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు కావస్తున్నా ఇప్పటివరకు ఒక్క పేద కుటుంబానికి కూడా ఇంటి పట్టాను ఇచ్చిన పాపాన పోలేదన్నారు.అంతేకాకుండా పేదల ఇంటి నిర్మాణం కోసం ఐదు లక్షలు మంజూరు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి గంగులప్ప,జిల్లా మహిళా సహాయ కార్యదర్శి ఆదిలక్ష్మమ్మ,రైతు సంఘం మండల కార్యదర్శి గంగిశెట్టి,ఉమాశంకర్,షేక్ బీబీ తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉల్లిని దిగుమతి చేసుకొని ప్రత్యేక కౌంటర్ల ద్వారా అమ్మకాలు చేపట్టాలి

### కలెక్టర్ టి.ఎస్.చేతన్

**విశాలాంధ్ర-పుట్టపర్తి:** కర్నూల్ మార్కెట్ యార్డ్ నుంచి ఉల్లిని దిగుమతి చేసుకుని జిల్లాలో అన్ని మండలాలలో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి అమ్మకాలు చేపట్టాలని కలెక్టర్ టి.ఎస్. చేతన్ ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా పౌరసరఫరాల శాఖ ద్వారా నిత్యవసర వస్తువుల ధరల పర్యవేక్షణ మరియు నియంత్రణపై కలెక్టర్ అధ్యక్షతన, సంబంధిత శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, జిల్లా సివిల్ సప్లై అధికారి వంశీకృష్ణా రెడ్డితో పాటు వివిధ శాఖ అధికారులు హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ నిత్యావసర వస్తువులు ధరలు అకస్మాత్తుగా పెరగకుండా ప్రభుత్వం చేపడుతున్న చర్యలపై ప్రజలకు అవగా హన కార్యక్రమాలు సివిల్ సప్లై అధికారులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రజా పంపిణీ వ్యవస్థ జిల్లాలో పటిష్టంగా అమలు చేయాలని, సివిల్ సప్లై అనుబంధ రంగాల శాఖలు చురుకగా పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా ప్రత్యేక కౌంటర్ ద్వారా తక్కువ ధరలకు విక్రయించడానికి రిటైల్ హోల్‌సేల్ వ్యాపారులు, దిగుమతిదారులు, మిల్లర్లతో సమావేశాలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ధరల పర్యవేక్షణ కమిటీ ప్రభుత్వ పోర్టల్‌లో రోజువారి నిత్యవసర వస్తువుల ధరలను పొందుపరిచే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ధరల పర్యవేక్షణ కమిటీ నేతృత్వంలో జిల్లాలో ఉన్న వేరుశెనగ మిల్లుల మూసివేతకు గల కారణాలను తెలుసుకొని తనకు వారం రోజుల్లోగా నివేదిక రూపంలో సమర్పించాలని అసిస్టెంట్ డైరెక్టర్ మార్కెటింగ్ శాఖ వారిని ఆదేశించారు. అలాగే గత 10 ఏళ్లుగా ఎన్ని వేరుశనగ మిల్లులు పనిచేస్తున్నాయో ఆ వివరాలు కూడా తెలపాలన్నారు. బియ్యం, కందిపప్పు, టమాటా, ఉల్లి ధరల నియంత్రణపై సమావేశంలో చర్చించారు.

అనంతరం జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా నాణ్యమైన బియ్యం, కందిపప్పు, వంట నూనెలు విక్రయించడా నికి అన్ని మండల ప్రధాన కేంద్రాలలో 34 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయడం జరిగిందని .06 బిగ్ చైన్ రిటైలర్లలో 19 హోల్‌సేల్ డీలర్ల ప్రాంగణంలో "32 కౌంటర్లు అమ్మకానికి తెరవబడ్డాయని పామాయిల్, సన్‌ఫ్లవర్ ఆయిల్ మార్కెట్ ధర కంటే తక్కువ ధరకు విక్రయాలు జరుగుతున్నాయని డీఎస్‌ఓ తెలిపారు.

## ఘనంగా అంతర్జాతీయ బాలుల హక్కుల దినోత్సవం

**విశాలాంధ్ర-ధర్మవరం :** పట్టణంలోని సాయి నగర్‌లో గల సూర్య ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయులు నడుమ అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవం ఘనంగా నిర్వహించామని పాఠశాల కరెస్పాండెంట్ నరేంద్రబాబు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ మానవ హక్కుల ఒప్పందమైన హింస నుండి రక్షించడానికి, జీవించే హక్కు, ఆరోగ్యం ,విద్య, ఆటలు, అనేక బాలల హక్కులను నిర్దేశిస్తుందని తెలిపారు. ఇదే రోజున అంతర్జాతీయ బాలల దినోత్సవంగా కూడా జరుపుకుంటారని తెలిపారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శ నలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో జ్యోతి, మారుతి, సునీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## చక్కటి కంటిచూపుతోనే మెరుగైన విద్య

**విశాలాంధ్ర-ధర్మవరం:** చక్కటి కంటి చూపుతోనే మెరుగైన విద్య లభిస్తుందని కంటి వైద్య నిపుణులు రిటైర్డ్ జిల్లా అందత్వ నివారణ అధికారి డాక్టర్ ఎస్.నరసింహులు తెలిపారు. బుధవారం పట్టణంలోని జీవనజ్యోతి ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో ఒకటవ తరగతి నుంచి పదవ తరగతి వరకు గల విద్యార్థులకు"జాతీయ హ్రస్వ దృష్టి వారోత్సవాలు" ముగింపు కార్యక్రమంను పురస్కరించుకొని కంటి చూపు సమస్యలు వాటి పరిష్కారంపై పలు విషయాలను పాఠశాల ప్రార్థన సమయంలో తెలియజేశారు. కంటిని ఎలా కాపాడుకోవాలి అన్న విషయాన్ని విశదీకరించారు. డాక్టర్ నరసింహులు మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులందరికీ కంటి చూపు సక్రమంగా ఉంటే చక్కటి విద్య లభిస్తుందని, అప్పుడే ఉత్తమ పరీక్ష ఫలితాలు లభించే అవకాశం ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు ఎవరైనా కంటికి దగ్గరగా పెట్టుకుని చదువుతూ ఉంటే తరగతి గదిలో నల్ల బోర్డుపై రాసిన అక్షరాలు కనపడని వారు కూడా దృష్టిలోపం ఉన్న వారిగా గుర్తించాలని తెలిపారు. అనంతరం 170 మంది విద్యార్థిని విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలను నిర్వహించి వారి వారి దృష్టి లోపం తెలియజేశామన్నారు. చిన్నారులకు ఆట వస్తువులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ సుజాత, కర స్పాండెంట్ రెన్సి, పూర్వపు విద్యార్థి, ఎంటోడు ఫార్మా సిటికల్ లిమిటెడ్ మెడికల్ రిప్రజెంటేటివ్ చంద్రశేఖర్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, బోధ నేతర సిబ్బంది పాల్గొన్నారు.

## రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు చేయాలి

**విశాలాంధ్ర-పెనుకొండ :** పెనుకొండలోని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం న్యాయవాదులు రాయల సీమలో కోర్టు ఏర్పాటు చేయాలని తమ విధులను బహిష్కరిరు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, విడిపోయినప్పుడు అభివృద్ధి వికేంద్రీకరణ చేయాలని ఉద్దేశంతో మన రాష్ట్రము మూడు భాగాలుగా ఉన్నందున రాయలసీమ, కోస్తా ,ఉత్తరాంధ్ర, మూడు ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయాలని ఉద్దేశంతో, రాయలసీమలో హైకోర్టు ఏర్పాటు చేస్తామని గత ప్రభుత్వాలు హామీ ఇచ్చారని కొంతవరకు హైకోర్టు ఏర్పాటుకు పనులు జరుగుతున్న సందర్భంలో మరియు ప్రభుత్వం మారి మళ్ళీ అమరావతిలో హైకోర్టు ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వము కనిపిస్తున్నదని సోషల్ మీడియాలో వస్తున్న వార్తలను బట్టి మేము పూర్తిగా ఖండిస్తున్నామని రాయలసీమలో తప్పక హైకోర్టు ఏర్పాటు చేయకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని రాష్ట్ర వైఎస్ఆర్సిపి లీగల్ సెల్ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ నాగరాజు పేర్కొన్నారు , ఈ కార్యక్రమంలో బార్‌అసోసియేషన్ ప్రెసిడెంట్ వాల్మీకి శ్రీనివాసులు, సుదర్శన్ రెడ్డి, మోహన్ నాయక్, హరి, బాలాజీ, జా వేద్, నాగిరెడ్డి, ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.

## రైతు సంఘం మండల కార్యదర్శిగా గంగిశెట్టి

**విశాలాంధ్ర-నంబులపూలకుంట:** రైతు సంఘం మండల కార్యదర్శిగా గంగిశెట్టి ఎన్నికైనట్లు సిపిఐ మండల కార్యదర్శి జి రమణ,సహాయ కార్యదర్శి గంగులప్ప పేర్కొన్నారు. బుధవారం నిర్వహించిన కార్యవర్గ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిపిఐ పార్టీ అనుబంధ రైతు సంఘం కార్యదర్శిని ఎన్నుకున్నట్లు తెలిపారు. పార్టీ బలోపేతానికి,ప్రజల సమస్య లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే విధంగా ప్రతి నాయకుడు, కార్యకర్తలు పాటు పడాలని సూచించారు. త్వరలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మహిళా సహాయ కార్యదర్శి ఆదిలక్ష్మమ్మ, షేక్ బీబీ,ఉమా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## శకుంతలమ్మ భౌతికంగా దూరం కావడం పార్టీకి తీరని లోటు

### సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్

**విశాలాంధ్ర-కదిరి,:** కమ్యూనిస్ట్ పార్టీలో మహిళా సమాఖ్య నాయకురాలు శకుంతలమ్మ భౌతికంగా దూరం కావడం పార్టీకి తీరని లోటని జిల్లా సిపిఐ కార్యదర్శి వేమయ్య యాదవ్ పేర్కొన్నారు.బుధవారం సీపీఐ పార్టీ కార్యాలయంలో వేమయ్య యాదవ్ మాట్లాడుతూ శకుంతలమ్మ మృతి చాలా బాధాకరమన్నారు. ఏపీ మహిళా సమైక్య జిల్లా కార్యదర్శిగా, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులుగా పని చేస్తూ పార్టీకి ఎనలేని సేవలు అందించారన్నారు.ఈమె భర్త రుష్యేంద్రబాబు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులుగా పని చేశారన్నారు. శకుంతలమ్మకు ఇద్దరు కుమారులుండగా ఒకరు మృతి చెందారన్నారు. శకుంతలమ్మ పార్థివ దేహాన్ని మెడికల్ కళాశాలకు అప్పగించడానికి కుటుంబ సభ్యులు నిర్ణయం తీసుకున్నారన్నారన్నారు. ఆమె బ్రతికున్నంత కాలం సమాజ సేవకే అంకితమయ్యారని పేర్కొన్నారు. ఆమె మరణ వార్త పట్ల సిపిఐ పార్టీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు.

## అయ్యప్ప మాలదారులకు నేటి నుంచి అన్నదానం

**విశాలాంధ్ర-గోరంట్ల:** అయ్యప్ప మాల దీక్ష దారులకు 21 న గురువారం నుండి మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు గోరంట్ల పట్టణ కేంద్రంలో గల దామర వద్ద అయ్యప్ప స్వామి దేవస్థాన ఆలయ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. 06-01-2025 సోమవారం వరకు అయ్యప్ప మాల దీక్ష దారులకు ప్రతిరోజు మధ్యాహ్నం 12.45 గంటల నుండి 2.00 గంటల వరకు అన్న ప్రసాద వితరణ చేయనున్నట్లు ఆలయ గురు స్వామి రుషేంద్ర,ఆలయ కమిటీ సభ్యులు బాల రంగయ్య, రాజశేఖర్ రెడ్డి, కృష్ణమాచారి, ల్యాబ్ రామకృష్ణారెడ్డి,కొండ్రెడ్డిపల్లి సుబ్బిరెడ్డి, ఆలయ అకౌంటెంట్ వెంకట రెడ్డి తెలిపారు.

## పంటల బీమా ప్రీమియం చెల్లించుకోవాలి

**విశాలాంధ్ర-పెనుకొండ:** మండలంలో బుధవారం ఎర్రమంచి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ అధికారిణి కె.సి.చందన మాట్లాడుతూ.రైతులు రబీ సీజన్ లో సాగు చేసిన పంటలకు భీమా ప్రీమియం చెల్లించాలని తెలిపారు. వరి, వేరుశెనగ,టమోటా పంటలకు రైతులు పంట భీమా చేయించుకోవడం వల్ల పంట నష్టపోతే, నష్టపరిహారం పొందవచ్చని తెలిపారు. వరి పంటకి డిసెంబర్ ఆఖరులోపు, వేరుశెనగ, టమోటా పంటలకు డిసెంబర్ 15 తేదీ వరకు గడువుఉందని.ఒక ఎకరాకు వరి పంటకి రూ.630, వేరుశెనగ పంటకు రూ.480, టమోటా పంటకు రూ.1600 ప్రీమియం రైతులే చెల్లించాలన్నారు. సర్పంచ్ నాగమూర్తి, ఎఇఓ.అశోక్ కుమార్, బీమా కంపెనీ అధికారులు, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## పుస్తక పఠనంతో విజ్ఞానాన్ని పెంచుకోవాలి

**విశాలాంధ్ర-తనకల్లు :** విద్యార్థులు పుస్తక పట్టణంతో విజ్ఞానాన్ని పెంపొందించుకొని వారి భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని రిటైర్డ్ లైబ్రేరియన్ ఎస్ ఇమామ్ సాబ్ 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా విద్యార్థులకు సూచించారు. ప్రతి ఒక్కరూ గ్రంథాల యంలో సభ్యత్వం తీసుకుని అవసరమైన పుస్తకాలను పొందవచ్చన్నారు. గ్రంథాలయ అధికారి ఎస్.మస్తాన్ వలి మాట్లాడుతూ 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని మండల కేంద్రంలోని గ్రంథాలయంలో క్రీడలు వ్యాసరచన పోటీలు తదితరాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు వారోత్సవాల ముగింపు సందర్భంగా బహుమతులు ప్రదానం చేశామన్నారు. గ్రంథాలయాధికారితో పాటు ఎంపీపీ ఉర్దూ స్కూల్ ఉపాధ్యాయుడు సాధిక్ విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## శాంతి భద్రతపై ప్రత్యేక దృష్టిని సారిస్తా...

### అప్ గ్రేడ్ సీఐ నిరంజన్ రెడ్డి

**విశాలాంధ్ర-కదిరి:** తన పరిధిలోని అన్ని గ్రామాలలో శాంతి భద్రతలపై ప్రత్యేక దృష్టిని సారిస్తానని అప్ గ్రేడ్ సీఐ నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన అప్ గ్రేడ్ సీఐ గా బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాలలో చట్టపరంగా జీవించేలా అన్ని చర్యలు తీసుకుంటానని, చట్టంపై అవగాహన ప్రజలకు కల్పిస్తానని తెలిపారు. శాంతి భద్రతల విషయంలో ప్రత్యేక శ్రద్ధను కనపరుస్తానని, ఫ్యాక్షన్ గ్రామాలపై తప్పక నిఘా ఉంచడం జరుగుతుందన్నారు. ఇసుక అక్రమ రవాణా,పేకాట, మట్కా లాంటి అసాంఘిక కార్యక్రమాల నిర్మూలన కోసం టీమును ఏర్పాటు చేస్తానని తెలిపారు. గ్రామ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, శాంతి భద్రతలకు ఎవరైనా విఘాతం కలిగిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు.

## వైభవంగా విగ్రహాల ప్రతిష్ట..

**విశాలాంధ్ర-అమడగూరు:** మండల కేంద్రంలో వెలసిన శిరిడి సాయి బాబా ఆలయంలో నూతన విగ్రహ మహోత్సవ వేడుకలను ఆలయ సేవా సమితి, అమడగూరు గ్రామ ప్రజలు బాబా విగ్రహానికి పలు రకాల పూలమాలాలతో అలంకరించి స్వామివారి కి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదానం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. రాత్రికి అనేకమంది భజనలు నిర్వహిస్తున్నట్లు ఆలయ సిబ్బంది తెలిపారు.

## రీ సర్వేలో అందరికీ న్యాయం జరుగుతుంది.. ఆర్డీఓ మహేష్

**విశాలాంధ్ర-ధర్మవరం:** రెవెన్యూ డివిజన్ పరిధిలో ప్రతి గ్రామములో నిర్వహించబడే రీ సర్వేలో అందరికీ తప్పక న్యాయం చేకూర్చుతుందని ఆర్డిఓ మహేష్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మండల పరిధిలోని తుమ్మలలో నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికలోని గ్రామసభను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ గ్రామ సభలో వచ్చిన దరఖాస్తులను స్వీకరించి, షెడ్యూల్ తేదీల ప్రకారం పరిష్కరించబడుతుందని తెలిపారు. తదుపరి కొంతమంది రైతులు తమ సమస్యలను విన్నవించు కున్నారు. ఏ సమస్య అయినా కూడా సచివాలయంలో ఇవ్వాలని తెలిపారు. తదుపరి తుమ్మలలోని సచివా లయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయంలోని అన్ని రికార్డులను వారు పరిశీలిస్తూ, ఉద్యోగుల అటెండెన్స్‌లను తనిఖీ చేస్తూ సమయపాలనలో తేడా రాకూడదని హెచ్చరించారు. సచివాలయ ఉద్యోగులు బయటకు వెళ్ళినప్పుడు తప్పనిసరిగా మూమెంట్ రిజిస్టర్ లో నమోదు చేయాలని తెలిపారు. ఉద్యోగులందరూ కూడా సమన్వయంతో కలిసికట్టుగా పనిచేస్తే గ్రామ ప్రజల సమస్యలు సులభతరంగా పరిష్కారం అవుతాయని సూచించారు. విధి నిర్వహణ పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో సురేష్ బాబు, వీఆర్వో ప్రసాద్ ,గ్రామ సర్వేయర్ వాణి, సచివాలయ ఉద్యోగులుపాల్గొన్నారు.

## యాదవ కార్పొరేషన్ డైరెక్టర్‌కు సన్మానం

**విశాలాంధ్ర-పెనుకొండ :** మండల పరిధిలోని వెంకటగిరి పాలెం గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ కేశవయ్యను రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ గా రాష్ట్ర ప్రభుత్వము నియమించినందున బుధవారం యాదవ సంఘం నాయకులు ఆయనను ఘనంగా సన్మానించారు, కేశవయ్య భవిష్యత్తులో మరింత ఉన్నతమైన పదవులు పొందాలని ఆకాంక్షించారు, తెలుగుదేశం పార్టీ నాయకులు శ్రీరామ్ యాదవ్, ఆదదాకులపల్లి ప్రసాద్ హర్షం వ్యక్తం చేస్తూ, తెలుగుదేశం పార్టీలో సీనియార్టీకి గుర్తింపు లభించిందని కేశవయ్య తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని వారు తెలిపారు, కార్యక్రమంలో యాదవ సంఘం ప్రెసిడెంట్ కోగిర జయ చంద్రారెడ్డి, శ్రీనాథ్, మునియప్ప, శ్రీకాంత్ రెడ్డి, మోహనకృష్ణ, ఈశ్వరయ్య, శ్రీనివాసులు, పాల్గొన్నారు.

## మున్సిపల్ చైర్మన్‌గా బలరామిరెడ్డి పదవీ బాధ్యతలు

**విశాలాంధ్ర-హిందూపురం :** హిందూపురం మున్సిపాల్ చైర్మన్‌గా బలరామిరెడ్డి మంగళవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. వారు మాట్లాడుతూ, మున్సిపల్ అధికారులకు, కమిషనర్‌కు, ప్రతి ఒక్కరికిధన్యవాదాలు తెలిపారు. వారు మాట్లాడుతూ, మున్సిపల్ చైర్మన్గా నేను ఉన్నన్ని రోజులు, పట్టణ అభివృద్ధికి అందరితో సమన్వయం తో ముందుకు నడుస్తానని, మున్సిపల్ కార్యాలయంలో ప్రతిరోజు అందరికీ అందుబాటులో ఉంటానని, సమస్యలున్నచో మా దృష్టికి తెస్తే తప్పకుండా పరిష్కారానికి సాయ శక్తులా కృషి చేస్తానని తెలిపారు.

## కోడలుపై మామ కొడవలితో దాడి..

**విశాలాంధ్ర-పుట్టపర్తి :** కుటుంబ కలహాలతో కొడవలితో మామ కోడలి పై దాడి చేసిన ఘటన వెలుగు చూసింది. బుధవారం పట్టణానికి చెందిన మూర్తి, నందిని దంపతులు మధ్య గత కొంతకాలంగా కుటుంబ కలహాలు జరుగుతున్నాయి. గత కొన్ని రోజుల క్రితం నందిని పుట్టినిల్లు అయిన హిందూపురానికి వెళ్ళింది తిరిగి తల్లిదండ్రులతో పాటు అత్తగారింటికి రాగా భర్త ఇంట్లోకి అనుమతించక పోవడంతో ఆమె తల్లిదండ్రులతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు బయలుదేరారు. ఈ విషయం గమనించిన నందిని మామ అయినటువంటి ముత్యాలప్ప మార్గం మధ్యలో అడ్డగించి నచ్చచెప్పేందుకు ప్రయత్నించాడు. ఎంత చెప్పినా వినకపోవడంతో విసుగు జెందా వాడలిపై మామ కొడవలితో దాడి చేశాడు. గాయపడిన నందిని తల్లిదండ్రులతో కలిసి ఫిర్యాదు చేయడానికి పోలీస్ స్టేషన్ కి వెళ్ళింది. పోలీస్ స్టేషన్ లో వాగ్వివాదం చోటుచేసుకుంది. వెంటనే పోలీసులు ఆమె మామ ముత్యాలప్పను అదుపులోకి తీసుకొని తరలించారు ఆమెను హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. బాధితురాలి తల్లి మాట్లాడుతూ నా అల్లుడు కూతురు మధ్య విభేదాలు ఉండడంతో వారి ఇరువురికి నచ్చచెప్పేందుకు హిందూపురం నుంచి ఆమెను ఇక్కడికి తీసుకొచ్చామని ఈ క్రమంలోనే నా అల్లుడు తండ్రి నా కుమార్తె నందినిపై దాడి చేసినట్లు తెలిపారు.

## పంటలపై రైతులకు అవగాహన సదస్సు

**విశాలాంధ్ర-తలుపుల:** పంచాయితీలో పంటలపై రైతు నేస్తం ఆగ్రో ఏజెన్సీ వారి ఆధ్వర్యంలో రైతులకు మునార కంపెనీ వారు బుధవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. మునారా కంపెనీ శాస్త్రవేత్తలు కరుణం బాబు ప్రభాకర్ రావు అనిల్ కుమార్ దిలీప్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు మండలంలో మామిడి వేరుశనగ కలింగర దోస వంటి పంటలను సాగు చేస్తున్నారు. మంచి దిగుబడి సాగించాలంటే మా కంపెనీ నూతనంగా ప్రవేశపెట్టిన ఇంటెక్ గోల్డ్ బ్లాక్ ప్రేమ్ ఫోర్ ఎస్ టూ మండల్ వంటి ఎరువులను తీసుకొని వచ్చిందని ఈ ఎరువులు రైతులు వాడితే అధిక దిగుబడులు సాధించవచ్చని తెలియజేశారు. ఈ మందులతో పాటు సేంద్రియ ఎరువులు వాడడంతో రోగ పీడల నుంచి తప్పించుకోవచ్చని తెలిపారు. తలుపుల మండలం రైతులు రైతు సేవ ఆగ్రో ఏజెన్సీ ప్రొపరేటర్ అవినాష్ రెడ్డి, అభిషేక్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

## 23న చేపల చెరువులు వేలం

**విశాలాంధ్ర-గుడిబండ:** మండలంలోని కరికెర,కొంకల్లు పంచాయతీలోగల చేపల చెరువుల వేలంపాట నవంబర్ 23 వ తేదీన శనివారం నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శిలు ఖాలందర్,హరీష్,లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2024 2025 పసలి సంవత్సరం గాను బహిరంగ వేలం పాట 23 వ తేదీన శనివారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఉదయం 11 గంటలకు కరికెర చెరువు రాజ బండ చెరువు,హిరేతుర్పి చెరువులను అలాగే మధ్యాహ్నం రెండు గంటలకు కొంకల్లు చెరువు ను వేలంపాటను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సర్పంచ్‌లు గౌరమ్మశివన్న, కవితఓబన్న, మండల విస్తీర్ణ అధికారి నాగరాజు నాయక్‌ల సమక్షంలో నిర్వహిస్తున్నట్లు అలాగే ఈ వేలం పాటలో ఆసక్తిగల వ్యక్తులు డిపాజిట్ రూ.10 వేలు చెల్లించి పాల్గొన వచ్చని గ్రామపంచాయతీకి ఎటువంటి బకాయిలు ఉండకూడదని తెలిపారు.

## పాఠశాల విద్యార్థులకు పరిశ్రమలపై అవగాహన

**విశాలాంధ్ర-గుడిబండ:** మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల తొమ్మిదవ పదవ తరగతి విద్యార్థులకు వృత్తి విద్యలో భాగంగా ఎలక్ట్రానిక్స్ అండ్ హార్డ్వేర్ మ్యానుఫ్యాక్చరింగ్ అయ్యే విధానాన్ని భవిష్యత్తులో పరిశ్రమలు స్థాపనకు తీసుకోవలసిన కార్యాచరణపై అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయుడు గోవిందప్ప మాట్లాడుతూ ఐరన్ ఏ విధంగా వస్తువుగా తయారవుతుంది అనేటువంటి విషయంపై మండల కేంద్రంలో ఉన్న శ్రీ మైలార లింగేశ్వర ఇంజనీరింగ్ వర్క్స్ పరిధిలో విద్యార్థులకు పరిశ్రమ స్థాపన వంటి అనేక విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పి.డి సాయికృష్ణ, ఉపాధ్యాయులు భాగ్యలక్ష్మి సుష్మలు

## 23న పాఠశాలలకు సెలవు

**విశాలాంధ్ర-కొత్తచెరువు:** ఈనెల 23వ తేదీ భగవాన్ శ్రీ సత్య సాయి బాబా 99 వ జన్మదిన వేడుకలు సందర్భంగా పుట్టపర్తి కొత్తచెరువు బుక్కపట్నం నల్లమడ మండలాల్లో అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలకు ఆప్షనల్ హాలిడేగా ప్రకటించామని జిల్లా డీఈవో కిష్టప్ప తెలిపారు. స్వామి జన్మదిన వేడుకల్లో పాల్గొనాలని కోరారు.

## కూలీల శాతం పెంచండి ..

### ... ఏపీడి లక్ష్మీనారాయణ

**విశాలాంధ్ర - అగళి :** ఉపాధి హామీ పథకంలో భాగంగా పనులు కోరిన వెంటనే ఉపాధి కూలీలకు పనులు కల్పించి కూలీల శాతం పెంచాలని ఏపీడి లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో బుధవారం ఉపాధి హామీ పనులపై ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష సమావేశం ఏపీవో శివన్న అధ్యక్షతన నిర్వహించారు. ఏపీడి మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు పని కోరిన వెంటనే పనులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కూలీల సంఖ్య పెంచడంతోపాటు వారికి ప్రతిరోజు పని కల్పించాలని తెలియజేశారు. ముఖ్యంగా క్షేత్ర సహాయకులు సాంకేతిక సిబ్బంది తమ అలసత్వాన్ని విడనాడాలని హెచ్చరించారు. హార్టికల్చర్ ప్లాంటేషన్ ప్రక్రియ నిర్దేశించిన సమయంలోనే పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని ఏలాంటి అవకతవకలకు పాల్పడకూడదని తెలిపారు. ఏపీవో శివన్న, ఈసీ శ్రీధర్, టెక్నికల్ అసిస్టెంట్లు వెంకటప్ప, రమేష్,ఈరప్ప, ఈరన్న, దేవగిరీష్,ఫీల్డ్ అసిస్టెంట్లు రంగనాథ్, మంజునాథ్, ఆంజనేయులు, రఘు, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

## మరసలపల్లిలో ఘనంగా గంగమ్మ పూజ

**విశాలాంధ్ర-చిలమత్తూరు రూరల్:** మండల పరిధిలోని మరసలపల్లి గ్రామంలో బుధవారం ఘనంగా గంగమ్మ పూజా కార్యక్రమం టిడిపి నాయకులు డిష్ అంజి ఆధ్వర్యంలో నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అంజి ఆహ్వానం మేరకు ఎంపీడీవో రమణమూర్తి, ఈఓఆర్డి నాయుడు ,ఏపీవో అప్ప స్వామి, పంచాయతీ కార్యదర్శి రాముల నాయక్ హాజరయ్యారు. ఈ నేపథ్యంలో అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించి, అధికారులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేసి, అనంతరం దుశాల్వతో సన్మానాలు చేశారు. వీరితోపాటు జనసేన పార్టీ నాయకులు జిల్లా కార్యదర్శి ఏవి. రమణ, అగ్గి శ్రీనివాసులు, ఆంజనేయులు, వెంకట శివ మనోహర్, చాగలేరు శంకరప్ప, సంయుక్త కార్యదర్శి సోమశేఖర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## వైసీపీ కార్యకర్తలపై కేసు కొట్టివేత

**విశాలాంధ్ర-మడకశిర :** 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అగలి పోలీస్ స్టేషన్ పరిధిలో వైసీపీ కార్యకర్తలపై పెట్టిన కేసును బుధవారం మడకశిర కోర్టులో విచారణ చేపట్టారు.న్యాయవాదిగా రాష్ట్ర వైఎస్సార్సీపీ కార్యదర్శి వైసి గోవర్ధన్‌రెడ్డి వైసిపి కార్యకర్తల తరఫున వాదించారు.పూర్వపరాలు పరిశీలించిన న్యాయమూర్తి కేసును కొట్టివేశారు. ఇలాంటి అక్రమ కేసులు 100 మందిపై బనాయించినా వారి తరఫున వాదించి వైకాపా కార్యకర్తలకు అండగా ఉంటానని న్యాయవాది తెలిపారు. గోవర్ధన్ రెడ్డికి బాధిత కార్యకర్తలు కృతజ్ఞతలు తెలిపారు.

## వీఆర్వో గిరిధర్ రెడ్డిపై చర్యలు తీసుకోండి

**విశాలాంధ్ర-ధర్మవరం:** పట్టణంలోని తాహసిల్దార్ కార్యాలయంలో వీఆర్వో గిరిధర్ రెడ్డి పై చర్యలు గైకొనాలని బాధితులు వాపోయారు. తాసిల్దార్ కార్యాలయ ఆవరణలో పోతుకుంట గ్రామానికి చెందిన మహిళ రైతు శ్రీ లత తన బాధను వ్యక్తం చేసింది. నా భూమి కి సంబంధించిన ఒరిజినల్ పత్రాలను వీఆర్వో బీరువాలో పెట్టుకుని నెలల తరబడి కార్యాలయం చుట్టూ తిప్పుతున్నాడని తెలిపింది. అంతకుముసుపే వీఆర్వో ఓ రైతు గొడవ పడుతుండగా, మధ్యలో జోక్యం చేసుకొని నా విషయంలో కూడా వీఆర్వో పనిచేయటం లేదని, బాహాటంగా 3 లక్షల లంచం ఇస్తేనే పని చేస్తారని తెలిపాడని ఆమె వాపోయింది. దీంతో ఆవరణంలో ఉన్న ఓ వ్యక్తి ఆ గొడవ దృశ్యాన్ని సెల్ ద్వారా తీసి సోషల్ మీడియాకు పంపడంతో అది వైరల్‌గా కొనసాగింది. దీంతో ఆర్డీవో మహేష్ ఆదేశాల మేరకు ఎమ్మార్వో సురేష్ బాబు వీఆర్వో గిరిధర్ రెడ్డిపై విచారణ జరిపి, నివేదికను ఉన్నతాధికారులకు పంపుతున్నట్లు తెలిపారు.

## ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

**విశాలాంధ్ర-ధర్మవరం:** గ్రంథాలయ వారోత్సవాలు ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు వైభవంగా నిర్వహించామని గ్రంథాలయ అధికారిని సౌభాగ్యవతి అంజలి పేర్కొన్నారు. బుధవారం స్థానిక బాబు జగ్జీవన్ రామ్ నగర్ లో గల ప్రధాన గ్రంథాలయ శాఖలో చివరి రోజు వివిధ పోటీలలో పాల్గొని విజేతలైన వారందరికీ బహుమతులను పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా యువర్స్ ఫౌండేషన్ బండ్లపల్లి రంగనాథ్, ఎల్ఐసి నాగరాజ్, హెడ్మాస్టర్ కవిత, కలవల శ్రీరామ్ పాల్గొన్నారు. అనంతరం అంజలి సౌభాగ్యవతి, ముఖ్య అతిథులు మాట్లాడుతూ గ్రంథాలయమును వయస్సుతో నిమిత్తం లేకుండా అందరికీ ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. చదువుతోపాటు నిరుద్యోగులకు కావలసిన అన్ని స్టడీ మెటీరియల్ కూడా లభ్యమవుతాయని తెలిపారు. గ్రంథాలయ సభ్యత్వ ఉచితంగా పొందే అవకాశం ఉందని తెలిపారు. వారోత్సవాలకు సహకరించిన వారందరికీ పేరు పేరునా వారు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది శివమ్మ, రమణ నాయక్, గంగాధర్ లతోపాటు అధిక సంఖ్యలో పాఠకులు పాల్గొన్నారు.

## జాతీయ వాలీబాల్ స్థాయికి ఎంపికైన మున్సిపల్ విద్యార్థులు

**విశాలాంధ్ర-ధర్మవరం :** జాతీయ వాలీబాల్ స్థాయి పోటీలకు పట్టణంలోని కొత్తపేటలో గల ఎస్పీసీఎస్ మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని హెడ్మాస్టర్ పద్మజ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా పీలేరులో జరిగిన రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీయందు మా విద్యార్థులు ప్రతిభను కనపరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు. జాతీయస్థాయి వాలీబాల్ పోటీలలో ఎస్. చరణ్ కుమార్ యు.పుష్పాంజయ్ ఎంపిక కావడం జరిగిందని తెలిపారు. ఈ విద్యార్థులు డిసెంబర్ 6 నుండి 8 వరకు జరుగు పంజాబ్‌లోని లుధియానాలో జరిగే జాతీయస్థాయి వాలీబాల్ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. హెడ్మాస్టర్‌తో పాటు, ఎంఈఓ రాజేశ్వరి దేవి,టీచర్ ఆదినారా యణ, భాస్కర్, పీఈటి పద్మాబాయి,ఉపాధ్యాయ బృందం, బోధ నేతర బృందం శుభాకాంక్షలు తెలియజేశారు.

## నాణ్యమైన భోజనాన్ని పంపిణీ చేయాలి

**విశాలాంధ్ర-ధర్మవరం:** ప్రభుత్వ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులందరికీ విధిగా పంపిణీ చేయాలని ఆర్డీవో మహేష్ తెలిపారు. బుధవారం పట్టణంలోని శివానగర్లో గల మున్సిపల్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తదుపరి తరగతుల గదులను, మరుగు దొడ్లను, వంటగదిని వారు పరిశీలించి, పరిశుభ్రతంగా ఉండే విధంగా చూడాలని హెడ్మాస్టర్ లక్ష్మీనారాయణకు సూచిం చారు. తదుపరి నిర్మాణంలో ఉన్న గదులను కూడా పరిశీలిం చారు. నాణ్యమైన చదువును ఉపాధ్యాయులు బోధించాలని తెలిపారు. హెచ్ఎం. లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

## ఉపాధి కూలీల హాజరు పెంచండి.

**విశాలాంధ్ర-ఓబుళదేవరచెరువు:** ఉపాధి కూలీల హాజరును మరింత పెంచాలని డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయ ప్రసాద్ పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధి హామీ టెక్నికల్, ఫీల్డ్ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ పండ్ల తోటలు సాగుపై ప్రత్యేక దృష్టిసారించి, పెండింగ్ బిల్లులను వెంటనే సాగు రైతులకు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఏపిడి జ్యోతి, ఏపిఓ సుధాకర్, టెక్నికల్, ఫీల్డ్ సిబ్బంది రాజారెడ్డి, చంద్రారెడ్డి, ఆంజనేయులు పాల్గొన్నారు

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandra.com
కర్నూలు, గురువారం 21, నవంబర్ 2024

# రైతుకు రక్షణ కవచం పంటల బీమా

**జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి**

**విశాలాంధ్ర-అనంతపురం:** పంటల బీమా రైతులకు రక్షణ కవచంలా ఉంటుందని, పంటల బీమాపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం అనంతపురం నగరంలోని జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో క్రాప్ ఇన్సూరెన్స్ పై జిల్లాస్థాయి పర్యవేక్షణ కమిటీ (డిఎల్ఎంసి) సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పంటల బీమా పథకం, రబీ : 2024- 25, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, పునర్వ్యవస్థీకరించబడిన వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం (ఆర్.డబ్ల్యు.బి.సి.ఐ.ఎస్) పట్ల రైతులకు క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. పంటల బీమా వల్ల తుఫానులు, కరువు, అకాల వర్షాలు వంటి ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట దిగుబడి నష్టపోయినా ఆర్థిక సహాయం అందించడం, వాతావరణ అంశాల ఆధారంగా సంభవించిన పంట నష్టాన్ని అంచనావేసి బీమా పరిహారాన్ని చెల్లించడం, ఎంపిక చేసిన పంటలను సాగు చేస్తూ నిర్ణీత సమయంలో ప్రీమియం చెల్లించి నమోదు చేసుకున్న కౌలు రైతులతో సహా రైతులందరూ ఈ బీమా పథకంలో చేరడానికి అర్హులని, ఈ విషయాన్ని రైతులకు తెలియజేయాలన్నారు. ఎంపిక చేసిన పంటలకు బీమా చేసిన మొత్తానికి రైతు 1.5 శాతం చెల్లించాలని, వాణిజ్య, ఉద్యాన పంటలకు 5 శాతం రైతు చెల్లించాలన్నారు. పంటల బీమా నమోదుకు ఆఖరు తేదీ డిసెంబర్ 15 అని, అప్పటిలోగా పంటల బీమా నమోదు చేసుకునేలా చూడాలన్నారు. పంటలకు ఏ రోగం వస్తే ఏం చేయాలి అనేది కరపత్రాలు ముద్రించాలని, రైతులకు పంపిణీ చేయాలన్నారు. రైతు సేవ కేంద్రాల్లో కరపత్రాలను నోటీస్ బోర్డులలో, టీవీలలో ప్రదర్శించాలన్నారు. ఈ సందర్భంగా పంటల భీమా చేయండి.. రక్షణ కవచం పొందండి, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ ఏ.మాలోల, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి ఉమామహేశ్వరమ్మ, సిపిఓ అశోక్ కుమార్, ఉద్యాన శాఖ డిడి నరసింహారావు, డిపిఎం నాగరాజు నాయుడు, ఎల్డిఎం నర్సింగరావు, ఎన్ఐసి డిఐఓ రవిశంకర్, అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్ దాసు, ఫ్యూచర్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ స్టేట్ ప్రెసిడెంట్ ప్రశాంత్, జిల్లా మేనేజర్ నరసింహమూర్తి, డివిజనల్ కోఆర్డినేటర్ షఫీ, ఏవో శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## నిధులు మంజూరు చేయాలని సీఎంకు ఎమ్మెల్యే వినతి

**విశాలాంధ్ర - నార్పల :** నియోజకవర్గ పరిధిలోని పలు సమస్యలు పై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గ పరిధిలోని గండికోట నుండి పుట్లూరు వయా సుబ్బరాయ సాగర్ ఎత్తిపోతల పథకంకు ఫైనాన్స్ క్లియరెన్స్ లభిస్తే, దాదాపు 35,000 వేల ఎకరాల భూమి సాగులోనికి వస్తుందని అలాగే శింగనమల మండలంలోని రాచేపల్లి గ్రామ సమీపంలో ఉన్న లెదర్ ఫ్యాక్టరీ ని పునఃప్రారంభం చేస్తే, దాదాపు 3,000 మంది ఎస్సి కుటుంబలకు ఉపాధి లభిస్తుందని అలాగే మండలంలో 2003 సం.లో నీటి ముంపునకు గురైన ఉల్లికల్లు, ఉల్లికంటి గ్రామ ప్రజలుకు పునరావాసంకు ఇచ్చే నిధులు పాత ప్యాకేజీ గాకుండా, కొత్త ప్యాకేజీ కింద ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు.బుక్కరాయసముద్రం, నార్పల, గార్లదిన్నె లను కరువు మండలాలుగా ప్రకటించిన నేపథ్యంలో ఆ మండలాల రైతులను ఆదుకోవాలని కోరారు. జిల్లాలో ఎంతో వెనకబడిన ఎస్సి నియోజకవర్గమైన శింగనమల కు ఎక్కువ నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే శ్రావణిశ్రీ ముఖ్యమంత్రి చంద్రబాబు కు వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గ సమస్యలు పై సానుకూలంగా ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

## అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి సారించండి

**విశాలాంధ్ర-అనంతపురం:** రోడ్డు సేఫ్టీ, సైబర్ మోసాలు, మత్తు పదార్థాల కట్టడిలపై దృష్టి పెట్టాలని జిల్లా ఎస్పీ పి జగదీష్ పేర్కొన్నారు. పోలీసు అధికారులతో పోలీస్ కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం నెలవారీ నేర సమీక్షా నిర్వహించారు. జిల్లాలో నమోదైన గ్రేవ్, నాన్ గ్రేవ్, అస్తి సంబంధిత నేరాలు మరియు ఇతర కేసుల నమోదు, చేధనల గురించి సర్కిల్ వారీగా పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించి, సి డి ఫైల్స్ క్షుణ్ణంగా పరిశీలించడం జరిగింది. జిల్లాలో పెండింగ్ లో ఉన్న గ్రేవ్ , నాన్ గ్రేవ్ కేసులు, హత్య కేసులు, పోక్సో , రేప్ కేసులు, డెకాయిటీ, రాబరీ, ప్రాపర్టీ, వాహనాలు దొంగతనం, మిస్సింగ్, చీటింగ్ కేసులు, ప్రాపర్టీ కేసులు, రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలు, 174 సీఆర్ .పి .సి కేసులు, ఎన్ఫోర్స్‌మెంట్ వర్క్, పెండింగ్ ఎన్ బి డబ్ల్యూ ఎస్ , ఎన్ డి పి ఎస్ కేసులలో దర్యాప్తు, రికవరీల గురించి సర్కిల్ వారీగా పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.....కేసుల ఛేదింపునకు మరియు పరిష్కారానికి, నేర నియంత్రణకు దోహదం చేసే పలు సూచనలు మరియు మెళకువలను అధికారులకు దిశా నిర్దేశాలు చేశారు. జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ నుండీ ఇచ్చే ఆదేశాలు, కార్యక్రమాలు తప్పనిసరిగా నిర్వహించాలి. ఆయా పోలీసు అధికారులు గ్రామాల సందర్శన తప్పనిసరిగా చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించాలి. ఇతర ప్రభుత్వ విభాగాలతో కలసి బ్లాక్ స్పాట్స్ సందర్శించి తగు చర్యలు తీసుకోని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు.. రోడ్డు భద్రతా నియమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రాంగ్ రూట్‌లో వెళ్లే వాహనాలపై, ఓవర్లోడ్, ట్రిపుల్ రైడ్, హెల్మెట్ లేకుండా మరియు రోడ్డు నిబంధనలు పాటించని వాహనదారులపై ఈ చలాన ద్వారా ఫైన్లు విధించాలని ఆదేశాలు జారీ... ఓపెన్ డ్రింకింగుపై దృష్టి పెట్టాలన్నారు. సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకోకుండా ప్రజల్లో అవగాహన తీసుకొని రావాలన్నారు. మహిళల భద్రతపై ప్రాధాన్యతగా దృష్టి సారించాలన్నారు. ప్రజలతో మమేకమై వారితో స్నేహభావంతో సహాయకారిగా మెలిగినప్పుడే పోలీసులు పట్ల సదాభిప్రాయం ఏర్పడి విశ్వాసం పెరుగుతుందన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ యస్.పి. డి.వి.రమణమూర్తి, డీఎస్పీలు వి.శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, రవిబాబు, రామకృష్ణుడు, మహబూబ్ బాషా, జిల్లాలోని సి.ఐ లు, ఎస్సైలు, తదితర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా దీపారాధన

**విశాలాంధ్ర-ధర్మవరం:** పట్టణంలోని చెరువు కట్ట వద్ద గల ఖాద్రి రోజా ఏ ముబారక్, ధర్మవరం హజరత్ సయ్యద్ మహమ్మద్ షా ఖాదర్ వలీ రహమతుల అలై వారి 98వ ఊరుసే షరీఫ్ వేడుకలు ఈనెల 18వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ఘనంగా దర్గా కమిటీ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మూడవరోజు దీపారాధన ఫతేహా కానీ, జియారత్ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొత్త వాల్ ఖాజా హుస్సేన్, సోలిగాల్ల చిన్న వెంకటేశులు, మహబూబ్ అలీ, హైదర్ వలీ, సబ్జాన్, వెల్దుర్తి బాబా ఫక్రుద్దీన్, ముక్తియార్,తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం

**విశాలాంధ్ర-ధర్మవరం:**పట్టణంలోని ఖండా కన్వీనర్ పులిచెర్ల శ్రీనివాసులు స్వగృహము నందు సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో సమరసత దీపావళి కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య కార్మికులకు ఘనంగా సన్మానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్ష కన్వీనర్లు కేత గోపాల్ వాసుదేవయ్యలు ముఖ్య అతిథులుగా హాజరైనారు. అనంతరం వారు మాట్లాడుతూ వారిశుద్ధ్య కార్మికులు సేవలు అనన్యమైనవని ,సమాజంలో చాలా విలువైనవని వారు తెలిపారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులైన వెంకటేష్, మారుతి, లక్ష్మి ,ఎస్. లక్ష్మి చంద్రశేఖర్, లక్ష్మీనారాయణ లను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి నాగరాజు, సభ్యులు కృష్ణమూర్తి ,హరి, వెంకటేష్, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## విజేతలకు బహుమతులు పంపిణీ

**విశాలాంధ్ర-సంబులపూలకుంట:** గత వారం రోజులుగా జరుగుతున్న 57 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం సందర్భంగా వివిధ పోటీలలో విజేతలైన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేసినట్టు శాఖా గ్రంథాలయం అధికారిని శాంతమ్మ పేర్కొన్నారు. నాగార్జున హై స్కూల్ హెడ్మాస్టర్ మణికంఠ, ఉపాధ్యాయురాలు వెంకటేశ్వరి చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు. బాల్య దశ నుండే పుస్తకాలు చదవడం అలవర్చుకోవాలని,పుస్తక పఠనంతో తమ మేధస్సు పెంపొందించుకోవచ్చని, తద్వారా సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని అధికారిని శాంతమ్మ తెలిపారు. సిబ్బంది శారద,విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## రెవిన్యూ సమస్యల పరిస్కార వేదిక

**విశాలాంధ్ర - అగళి :** మండల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడం కోసమే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా రెవిన్యూ గ్రామసభలు నిర్వహించడం జరుగుతుందని సర్పంచ్ నరసింహమూర్తి తెలిపారు. మండల పరిధిలోని కోడిహళ్లి గ్రామంలో గ్రామ సభ నిర్వహించారు.అయన మాట్లాడుతూ మండ లంలో మిగులు భూములు పరిస్కారం కాని భూములను పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. కోడిపల్లి పంచాయతీ నుంచి మూడు దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ సుబ్బారావు తెలిపారు. తాహసిల్దార్ సుబ్బారావు, ఆర్ ఐ చంద్రశేఖర్, జిల్లా వాల్మీకి సంఘం ఉపాధ్యక్షులు రమేష్, బొమ్మర్శనపల్లి లింగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ ఎన్‌పీసీఐ లింక్ చేసుకోవాలి

**విశాలాంధ్ర-కదిరి:** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అన్ని రకాల పథకాలు లబ్ధి పొందాలంటే (నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఇండియా)ఎన్ పి సి ఐ లింక్ పొందాలని బ్రాంచ్ పోస్ట్ పోస్టర్ దివాకర్ రెడ్డి తెలిపారు. పోస్ట్ ఆఫీస్ నందు కేవలం రూ.200 లతో సేవింగ్ అకౌంట్ ప్రారంభిస్తూ ఎన్ పి సి ఐ లింక్ చేస్తున్నామని ఈ అవకాశాన్ని కదిరి ప్రాంత వాసులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## విజేతలకు బహుమతులు పంపిణీ

**విశాలాంధ్ర-రొద్దం:** స్థానిక గ్రంథాలయంలో బుధవారం 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా వారోత్సవాల భాగంగా చిత్రలేఖనం వ్యాస రచనలు తదితర పోటీల్లో విజేతలుగా నిలిచిన జిల్లా పరిషత్ హై స్కూల్ టీచ్ కాన్వెంట్ విద్యార్థులకు ఉపాధ్యాయులు హరిచంద్ర నాయక్, శ్రీనివాసులు, అంజన్ రెడ్డి ప్రశంస పత్రాలు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి నాగరాజు షేక్షావలి, పాల్గొన్నారు.

## డిజిటల్ లైబ్రరీలపై అవగాహన పెంచుకోండి

**విశాలాంధ్ర-కొత్తచెరువు:** డిజిటల్ గ్రంథాలయాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని జిల్లా వృత్తివిద్యాల అధికారి లాజర్ తెలిపారు. 57వ గ్రంథాలయ ముగింపు ఉత్సవాలలో భాగంగా బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, అలాగే డిజిటల్ గ్రంథాలయాల పైన కూడా అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఈ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వ్యాచారచన, వకృత, చిత్రలేఖ, పోటీలను నిర్వహించారు. ఇందులో ప్రథమ, ద్వితీయ, తృతీయ, స్థానాలలో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారి కే జయరాం, అటెండర్ వెంకటరమణ అప్ప, ఇన్చార్జి హెచ్ఎం విజయభాస్కర్, ఉపాధ్యాయులు రాధా ,లక్ష్మి, జానకి, అనంతలక్ష్మి, సుకన్య, తదితరులు పాల్గొన్నారు.

## ఏపీలో విద్యార్థులకు శుభవార్త

**విశాలాంధ్ర-అనంతపురం:** దేశవ్యాప్తంగా జవహర్ నవోదయ విద్యాలయాల్లో 9,11వ తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తు గడువును మరోసారి పెంచారు.నవంబర్ 26వ తేదీ వరకు విద్యార్థులు ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. జెండర్, కేటగిరీ, ఏరియా(రూరల్/ అర్బన్), డిజెబిలిటీ, పరీక్ష మాధ్యమం ఫీల్డ్స్ దరఖాస్తుల సవరణ అవకాశం నవంబర్ 26 తర్వాత రెండు రోజులు తెరిచి ఉంటుంది. ఫిబ్రవరి 8న ఎంట్రన్స్ పరీక్ష నిర్వహిస్తారు.

## గ్రంథాలయాలతో విజ్ఞాన సముపార్జన : ఈఓఆర్డీ

**విశాలాంధ్ర-రాప్తాడు:** గ్రంథాలయాల్లోని పుస్తకాలను చదవడం వల్ల విజ్ఞానాన్ని సముపార్జించుకోవచ్చని ఈఓఆర్డీ ఆనంద ప్రసాద్ అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు లైబ్రేరియన్ వీరనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ముగిసాయి. ముఖ్య అతిథిగా హాజరైన ఈఓఆర్డీ మాట్లాడుతూ ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో పిల్లలు సెల్ ఫోన్లు, ఫేసుబుక్, వాట్సప్, వీడియో గేమ్స్ పై సమయాన్ని వృధా చేసుకుంటున్నారని, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు వారిని గ్రంథాలయం వైపు మళ్లించేలా చొరవ చూపాలన్నారు. అందులో లభ్యమయ్యే పలు రకాల పుస్తకాలపై అవగాహన కల్పించి పుస్తక పఠనంపై శ్రద్ధ తీసుకొనేలా కృషి చేయాలన్నారు. పుస్తకాలకు మించిన స్నేహితులు లేరని, ప్రతి విద్యార్థి గ్రంథాలయానికి వచ్చి నచ్చిన పుస్తకాలను ఎంపిక చేసుకుని చదువుకోవచ్చన్నారు. అనంతరం వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ, క్విజ్, క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీహరి, లక్ష్మయ్య, పాఠకులు నాగభూషణం, రిటైర్డ్ ఉద్యోగి బుల్లే నాగన్న, పి.రామాంజనేయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గౌడ కులస్తులు అన్ని విధాలా అభివృద్ధి చెందాలి

**విశాలాంధ్ర-రామగిరి:** సమాజంలో ఈడిగ ( గౌడ )కులస్తులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని తెలుగు నాడు కల్లుగీత సంఘం రాష్ట్ర కార్యదర్శి సెక్రెటరీ పరకాల వెంకటేశ్వర్లు, రామగిరి మాజీ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ అన్నారు. బుధవారం మండలంలోని పోలేపల్లి గ్రామంలో రేణుకా యల్లమ్మ దేవాలయం వద్ద ఈడిగ, గౌడ కుల బంధువుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో కులం యొక్క భవిష్యత్తు గురించి, అభివృద్ధి పనుల గురించి చర్చించారు. పోలేపల్లి గ్రామంలో ఉన్న రేణుకా యల్లమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం గోపాల్ ,హెచ్ఎంఆర్ న్యూస్ రమణ గౌడ్, చెన్నకేశవులు గౌడ్ , పోలేపల్లి గౌడ కులస్తులు పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ

**విశాలాంధ్ర-చిలమత్తూర్ రూరల్:** మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారికారిణీ మంజువాణి. ఈ సందర్భంగా ఆసుపత్రి ఆవరణం, కాన్పుల గది, లేబరేటరీ,మందులు నిల్వ చేయుగది పరిశీలించి పలుసూచనలు చేశారు.రికార్డులను క్షున్నంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి తేజస్విని, సిహెచ్ఓ జయచంద్ర కుమార్, పర్యవేక్షకులు సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు చెరువులో చేపలు వేలం పాట

**విశాలాంధ్ర-రోళ్ల:** మండలంలోని కాకి,చెరువు మరియు కె.బ్యాడిగేర చెరువుల్లో చేపలు పెంపకానికి గురువారం వేలం పాట వేస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి రచన తెలిపారు.వేలం పాటలో పాల్గొనే పాటదారులు 3వేలు రూపాయలు రుసుం చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు. వేలం పాట ద్వారా చేపలు పెంపకానికి దక్కించుకొన్నవారు మొత్తాన్ని వెంటనే చెల్లించాలని ఆమె సూచించారు.

## జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు

**విశాలాంధ్ర - పెనుకొండ :** పెనుకొండ శాఖా గ్రంథాలయం నందు గ్రంథాలయాధికారి మహబూబ్ బాషా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 57 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలకు ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రిటైర్డ్ ఉపాధ్యాయులు షమీవుల, భాస్కర్ ప్రైవేట్ స్కూలు ఉపాధ్యాయులు దాదు గ్రంథాలయ పాఠకులు,విద్యార్థినీ విద్యార్థులతో ఒక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో గ్రంథాలయాలు విజ్ఞానము నిల్వ ఉన్న దేవాలయ మని విద్యార్థిని విద్యార్థులు చిన్న తనం నుండే గ్రంథాలయానికి వెళ్లి అక్కడ ఉండే విజ్ఞానాన్ని సముపార్జించుకుని ఉన్నతంగా ఎదగాలని వక్తలు కొని యాడారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి మహబూబ్ బాషా గ్రంథాలయ పాఠకులు ప్రజలు పాల్గొన్నారు .

## కేజీబీవీలో సబ్జెక్టు సామర్థ్య పరీక్షలు

**విశాలాంధ్ర-రొళ్ల:** మండల పరిధిలోని ఆవినకుంటలో గల కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో పాఠశాల విద్యాశాఖ సంచాలకుల ఆదేశాల మేరకు బుధవారం 6 నుంచి 9వ తరగతుల విద్యార్థులకు వారు చదువుతున్న సబ్జెక్టుల లో వారి సామర్థ్యాలను అంచనా వేయుటకు ఐదు మార్కుల చొప్పున మొత్తం 30 మార్కులకు పరీక్ష నిర్వహించారు. అదేవిధంగా 9వ నుంచి12వ తరగతుల విద్యార్థులకు వారి సబ్జెక్టులు,గ్రూప్ సబ్జెక్ట్‌లలో 30 మార్కులకు పరీక్ష నిర్వహించి ఆ పరీక్షల మూల్యాంక ఫలితాలను మండల విద్యాశాఖ కార్యాల యంలో అందించారు.ఈ మార్కులను జిల్లాశాఖ కార్యాలయానికి పంపనున్నట్లు ఎంఈఓ శ్రీధర్ తెలిపారు. పాఠశాల ఎస్.ఓ మున్వర్జాన్ విద్యార్థులు పాల్గొన్నారు..

## ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

**విశాలాంధ్ర-యాడికి:** మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం ఆవరణంలో ఉన్న గ్రంథాలయంలో బుధవారం 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ ఇంద్రసేనారెడ్డి హాజరై సరస్వతి చిత్రపటానికి పూలమాలు వేసి జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు కొత్త రాయుడు,శివయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని గ్రంథాలయాలు సరస్వతి నిలయాలని, దేవాలయాలనీ, నిత్యము మనము గ్రంథాలయాలకు వెళ్లి చదువుకోవాలన్నారు. బహుమతుల ప్రధాన కార్యక్రమంలో వ్యాస రూప పరీక్ష కాంపిటీషన్ లో మొదటి బహుమతి హర్షియా, రెండో బహుమతి హరిణి, డ్రాయింగ్ కాంపిటీషన్లో మొదటి బహుమతి స్ఫూర్తి, రెండో బహుమతి మానస గెలుపొందడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎం మధుసూదన్, గ్రంథాలయ సిబ్బంది వినయ్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆరోగ్య కేంద్రంకి ఆకాశరామన్న ఫిర్యాదులు

**విశాలాంధ్ర-పామిడి:** అంకితభావంతో విధులు నిర్వహిస్తున్న ఇబ్బందిపై గత నెల 26న జిల్లా కలెక్టరేట్లో పామిడి సామాజిక ఆరోగ్య ఆసుపత్రి వైద్యసిబ్బందిపై అవినీతి ఆరోపణలు చేస్తూ కొందరు ఆకతాయిలు తప్పుడు ఆరోపణలతో ఊరు, పేరు, ఫోన్ నెంబర్లు, ఆధార్ నెంబర్లు, లేని ఫిర్యాదులు ఇచ్చి ఇబ్బందులకు గురి చేశారన్నారు అని డాక్టర్ శివ కార్తీక్ రెడ్డి విశాలాంధ్రతో ప్రత్యేకంగా తెలిపారు. ఫిర్యాదుల్లో ఏమున్నాయి అంటే గౌరవ జిల్లా కల్లెక్టరు , మెజిస్ట్రేటు అనంతపుం వారి దివ్య సుముఖమునకు 26/10/2024. పామిడి.అనంతపురం జిల్లా పామిడి పట్టణంలో ప్రభుత్వ ఆసుపత్రి నందు ప్రజల ప్రాణాల పట్ల తీవ్ర నిర్లక్ష్యం మరియు అవినీతి జరుగుతుంది ఇక్కడ పనిచేస్తున్న మెడికల్ ఆఫీసర్ గారు మరియు ఇతనికి తొత్తులుగా పనిచేస్తున్న రాజశేఖర్ మరియు నరసింహ అనే వ్యక్తి కలసి ప్రభుత్వ ఆసుపత్రి యొక్క ఆరోగ్యశ్రీ నిధులు దుర్వినియోగానికి పాల్పడుతున్నారు రాజశేఖర్ కంప్యూటర్ ఆపరేటర్ ద్వార బర్త్ సర్టిఫికేట్ లకు మరియు బర్త్ సర్టిఫికేట్‌లో పేరు మార్పులకు 1000 నుండి 2000 రుపాలయాలు వసూలు చేస్తున్నారు మరియు ఆసుపత్రి హెచ్ డి ఎస్ నిధులు నకిలీ బిల్లులతో నిధులు కాజేస్తున్నారు. సిబ్బంది డ్యూటీలకు రాకపోయినా వారితో వేలల్లో డబ్బులు తీసుకుని హాజరు వేసి వారికి జీతాలు చెల్లిస్తున్నారు.నరసింహ అను వ్యక్తి ని నిబంధనలకు విరుద్ధంగా అనధికారికంగా కంప్యూటర్ ఆపరేటర్ గా నియమించుకుని అతనితో నకిలీ ఆరోగ్య శ్రీ కేసు లు చేసుకుని ప్రభుత్వాన్ని, ప్రజలను మోసం చేస్తూ నిధులను కాజేస్తున్నారు.రాజశేఖర్ అను ఉద్యోగితో సిబ్బంది డ్యూటీ కి రాకపోయినా వారు వచ్చినట్లు హాజరు చూపించి వారితో వాటాలు తీసుకుని వారికి జీతాలు చెల్లిస్తున్నారు. ఇతను బర్త్ సర్టిఫికేట్ లలో పేరు,ఇతర మార్పులకు 1000 రూపాయల నుంచి 2000 వరకు మెడికల్ ఆఫీసర్ పేరు చెప్పి వసూలు చేస్తున్నాడు.దయచేసి వీరి విధుల పట్ల నిర్లక్ష్యం మితిమీరిన అవినీతి పై లోతైన విచారణ చేసి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని పామిడి పట్టణ ప్రజలు కోరుకుంటున్నారు.ధన్యవాదములు పామిడి పట్టణ ప్రజల తరుపున అని ఉంది అని డాక్టర్ శివ కార్తీక్ రెడ్డి తెలిపారు.

## పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం

**విశాలాంధ్ర-శింగనమల:** మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో బుధవారం 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ముగింపు కార్యక్రమములో భాగంగా గ్రంథాలయాధికారి జి.కృష్ణ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్లో వ్యాస రచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు.ఈ పోటీలలో గెలిపొందిన విద్యార్థినీ, విద్యార్థులకు ప్రధానోపాధ్యాయురాలు కె.ఆర్ విజయలక్ష్మి చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేశారు, అనంతరం గ్రంథాలయ అధికారి జి కృష్ణ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మాదిరిగానే గ్రంథాలయ వారోత్సవాలు విద్యార్థినీ విద్యార్థులతో జరుపుకోవడం ఆనందంగా ఉందని, ఈ వ్యాసరచన పోటీల ద్వారా విద్యార్థినీ విద్యార్థుల్లో ఉత్తేజం పెరుగుతుందన్నారు, ఈ కార్యక్రమంలో పిడి నందకుమార్, అధ్యాపక బృందం విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు బహుమతుల ప్రధానం

**విశాలాంధ్ర- కళ్యాణదుర్గం:** గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం కళ్యాణదుర్గం శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు క్రీడలు చిత్రలేఖన పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి హెచ్ శ్రీనివాసులు, సరస్వతీ విద్యా మందిరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు తిరుమల్ రావు,చల్లా కిషోర్,ఏఎల్ఎం మూర్తి, పాల్గొన్నారు. 57వ గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా వివిధ పాఠశాల నందు విద్యార్థి విద్యార్థులకు వ్యాసరచన వకృత్వ ,చిత్రలేఖనము, డ్రాయింగ్, క్విజ్, మరియు క్రీడలు నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థులు పై పోటీలు శ్రద్ధతో రాసి బహుమతులు గెలుచుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది కే. ఉమామహేశ్వరి, బీడీసీ నిర్వాహకులు శ్యామల, యమున, వసంత కుమార్ రేష్మ, రఘు, బాలచంద గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

## గ్రంథాలయంలో విజేతలకు బహుమతులు ప్రధానం

**విశాలాంధ్ర-నార్పల:**57వ జాతీయ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా నార్పల శాఖ గ్రంథాలయం నందు బుధవారం గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. విద్యార్దులకు వ్యాసరచన వకృత్వ, పరుగు పోటీలను నిర్వహించి గ్రంథాలయ ప్రధాన అధికారిణి జీవన బహుమతులు ప్రధానం చేసారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాషా , శ్రీవేణి, కే ఎన్ ఎల్ ప్రసాద్, వెంకటేష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రధానమంత్రి ఆవాస యోజన వారోత్సవాలు

**విశాలాంధ్ర-గుత్తి:** మండలం జక్కలచెరువు గ్రామంలో బుధవారం జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ పర్యటించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ కు గుత్తి మండల టీడీపీ నాయకులు గుమ్మనూరు ఈశ్వర్,గుమ్మనూరు నారాయణ, స్వాగతం పలికారు.ఎంపీపీ విశాలాక్షి,ఎంపీడీవో ప్రభాకర్ నాయక్, తహసిల్దార్ ఓబులేష్ మరియు అధికారులు ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా కలెక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆవాస యోజన వారోత్సవాల్లో భాగంగా జక్కలచెరువులో ప్రజలందరూ ప్రధాన మంత్రి ఆవాస యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం పలువురు జిల్లా కలెక్టర్ కు సమస్యలతో కూడిన వినతి పత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ విశాలాక్షి ఎంపీడీవో ప్రభాకర్ నాయక్ తహశీల్దార్ ఓబులేసు అధికారులు,ప్రజలు పాల్గొన్నారు.

## పంటల బీమా పథకాన్ని సద్వినియోగించుకోండి

**విశాలాంధ్ర-బెలుగుప్ప:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రబీ 2024 పంట కాలం నుండి పంటల బీమా పథకాన్ని రైతులు స్వచ్ఛందంగా నమోదు చేసుకోనుటకు వివిధ పంటలకు అవకాశం కల్పించిందని మండల వ్యవసాయ అధికారి పృథ్వీ సాగర్ తెలిపారు. ప్రస్తుత రబీ పంటకాలానికి పప్పుశెనగ, వరి, జొన్న, మొక్కజొన్న మరియు వేరుశెనగ పంటలకు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన ద్వారా పంటలపై బీమా పొందడానికి అవకాశం ఉందని తెలిపారు.పప్పుశెనగ, జొన్న, మొక్కజొన్న మరియు వేరుశెనగ పంటలకు భీమా నమోదు చేసుకోవడానికి డిసెంబర్ 15ఆఖరి తేదీగా నిర్ణయించారు. వరి పంటకు డిసెంబర్ 31ఆఖరి తేదీన నిర్ణయించారు. కావున పై పంటలపై బీమా చెల్లించాలనుకున్న రైతులు మీ దగ్గరలోని కామన్ సర్వీస్ సెంటర్ లో ( మీ సేవ కేంద్రం) ప్రీమియం చెల్లించి పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. 1.5% ప్రీమియం రైతు వాటాగా ఎకరానికి పప్పు శెనగకు రూ.450/-, వరికి రూ. 0630/- జొన్నకు రూ.315/-, మొక్కజొన్నకు రూ.525/- వేరుశనగకు రూ.480/-చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ప్రీమియం చెల్లించే సమయంలో రైతు యొక్క పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్ పుస్తకము తీసుకొని మీసేవ కేంద్రానికి వెళ్ళినట్లయితే పంటల భీమా కొరకు నమోదు చేయడం జరుగుతుందని ఏవో తెలిపారు.

## రక్తదానంతో.. ప్రాణదాతగా నిలుద్దాం

**విశాలాంధ్ర- జేఎన్టీయూ ఏ:** వివిధ ప్రమాదంలో గాయపడిన సమయంలో రక్తదానంతో..ప్రాణదాతగా నిలుద్దాం అని మదనపల్లె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ డా.సి యువరాజ్ పేర్కొన్నారు. బుధవారం కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగంలో,యెన్.టి.ఆర్ ట్రస్ట్,తిరుపతి వారి ఆధ్వర్యంలో రక్త దాన శిబిరము కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం ప్రిన్సిపల్ మాట్లాడుతూ రక్తదానం నిస్వార్థమైన చర్య, సమాజంలోని ప్రతి పౌరుడి బాధ్యత కూడా రక్తదానం చేయడంలోనూ దాతలు సురక్షితమైన రక్తాన్నే దానం చేయాలి.గణాంకాల ప్రకారం మన దేశంలో ఆసుపత్రిలో చేరే ప్రతి ఏడుగురిలో ఒకరికి రక్తం అవసరం అవుతుంది. కానీ అర్హులైన వారిలో కేవలం 10 శాతం కంటే తక్కువ మంది మాత్రమే ఏటా రక్తదానం చేస్తున్నారు. 160 మంది రక్తదానం చేశారు. అడ్వైసెర్ ఆర్, డి డాక్టర్ తులసీరామ్ నాయుడు, రవి, మల్లికార్జున, యెన్.ఎస్.ఎస్ కో ఆర్డినేటర్ రాజేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

## 23న ఉచిత వైద్య శిబిరం

**విశాలాంధ్ర - గుంతకల్లు :** పట్టణంలో గుండె, కంటి వైద్య శిబిరం ఈ నెల 23న గుంతకల్లు 11వ వార్డ్ వైయస్సార్ యూత్ అధ్వర్యంలో శనివారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 6 గంటల వరకు 60 అడుగుల రోడ్డు అయ్యప్ప స్వామి స్కూల్ వద్ద కిమ్స్ సవేరా ఆసుపత్రి సహకారంతో ఉచిత గుండె,కంటి వైద్య శిబిరంను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఒక ప్రకటనలో తెలిపారు.

## పక్కా గృహాలకు దరఖాస్తులు చేసుకోండి : ఏఈ సంపత్ కుమార్

**విశాలాంధ్ర-నార్పల :**మండలంలో అర్హత ఉండి పక్క గృహాలు లేనివారు దఖాస్తులు చేసుకోవాలని హౌసింగ్ ఏఈ సంపత్ కుమార్ తెలిపారు. లబ్దిదారులు ఆయా పంచాయితీలలో సచివాలయంలో దరఖాస్తు చెయాలన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులను కాపాడుకోవాలి

**విశాలాంధ్ర-అనంతపురం:** మన నగర పరిశుభ్రత కోసం తమ ప్రాణాలను పణంగా పెట్టి పాటుపడుతున్న ప్రతి పారిశుద్ధ కార్మికుని ఆరోగ్యం రక్షణ మనందరి బాధ్యత అని డిస్కవరీ అనంతపురం వ్యవస్థాపకులు ఏ.అనిల్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం మూడవ సర్కిల్లోని పారిశుద్ధ్య కార్మికులందరికీ నాణ్యమైన గ్లౌసులు, ,సానిటరీ ప్యాడ్స్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పారిశుద్ధ కార్మికుల ఇంట్లో మహిళల కోసం ప్రతి నెల డిస్కవర్ అనంతపురం గ్రీన్ ఆర్మీ వారు అందజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో అనంత ఆర్మీ సభ్యులు, పారిశుద్ధ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

## తప్పిపోయిన బాలికను గంటలోపు చేదించిన పోలీసులు

**విశాలాంధ్ర-అనంతపురం:** తెలంగాణ రాష్ట్రం జోగులాంబ గద్వాల జిల్లాకు చెందిన రఫీ, అక్బర్ బీ దంపతులు కుటుంబం సహా అనంతపురం జిల్లా నార్పల మండలం గూగూడుకు రెండ్రోజుల కిందట వచ్చారు. అక్కడ ఓ వేడుకలో పాల్గొని అనంతపురంలోని ఇంద్రజిత్ గుప్తా కాలనీ (మబ్బు కొట్టాల) లో ఉంటున్న బంధువులు ఇంటికి వెళ్లారు. బుధవారం ఉదయం రఫీ, అక్బర్ బీ కూతురు షేక్ హీనా (8 సం.లు) ఇంట్లో నుండీ చెప్పా పెట్టకుండా వెళ్లిపోయింది.ఈ విషయం గమనించి తల్లిదండ్రులు అనంత పురం రూరల్ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. జిల్లా ఎస్పీ శ్రీ పి.జగదీష్ ఆదేశాలతో అనంతపురం రూరల్ సి.ఐ ఎన్ శేఖర్, ఎస్సై కె.రాంబాబుల ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి చిన్నారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఫిర్యాదు అందిన గంటలోపు ఈ బృందాలు షేక్ హీనాను స్థానిక లక్ష్మీనగర్ ఉర్దూ స్కూలు వద్ద పట్టుకు న్నారు. రఫీ, అక్బర్ బీ దంపతులకు అమ్మాయిని సి.ఐ, ఎస్సైలు అప్పగించడంతో వారు హర్షం వ్యక్తం చేశారు. చిన్నారిని ట్రేస్ చేయడంలో శ్రమించిన సి.ఐ, ఎస్సై ల బృందాలతో పాటు కానిస్టేబుల్ పాండవను జిల్లా ఎస్పీ అభినందించారు.

## ఆలయంలో చోరీ

**విశాలాంధ్ర-ఉరవకొండ :** ఉరవకొండ పట్టణంలో షిరిడి సాయి ఆలయంలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. మూడు కిలోల పంచలోహ విగ్రహం, 60 గ్రాముల వెండి ఆభరణాలను దొంగలు ఎత్తుకెళ్లినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. సంఘటనపై ఉరవకొండ పోలీసుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పిల్లల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

**విశాలాంధ్ర - హిందూపురం :** పట్టణంలోని న్యూ హస్నాబాద్ 3 అంగన్వాడి కేంద్రం నందు లోక్ అదాలత్ ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ బాలల దినోత్సవం న్యాయవాదులు కళావతి సవేరా రవిచంద్ర ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మూడేళ్ల లోపు ఉన్న చిన్నారులను అంగన్వాడీ కేంద్రంలో చేర్పించాలని, అంగన్వాడి కేంద్రంలో అందిస్తున్న పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలని, ఐదేళ్ల వయస్సు రాగానే ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు.ఈ కార్యక్రమంలో న్యాయవాది గురునాథ్,అంగన్వాడీ కార్యకర్త రాజేశ్వరి, లైజనింగ్ అధికారి శ్రీనివాసులు,లోక్ అదాలత్ శారదలు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకం ప్రారంభం

**విశాలాంధ్ర-పామిడి:** మండలకేంద్రమైన పామిడిలో బుధవారం ఎట్టకేలకు ఉపాధి హామీ పథకంను యంపిడిఓ తేజోష్ణ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఇందులో బాగంగా మండలప్రజాపరిషత్ ఆవరణలో రూఫ్ వాటర్ హార్వెస్ట్ స్ట్రక్చర్ కు భూమి పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా యంపిడిఓ తేజోష్ణ మాట్లాడుతూ పామిడి గ్రామపంచా యతీకి చెందిన పామిడి, కొత్తపల్లి, కొండాపురం గ్రామాల్లో ఉపాధి పనులకు రావాలను కొన్న వారు జాబుకార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఒకవేల గతంలోని పాతకార్డులున్నవారు వాటిని యాక్టివేషన్ చేసుకోవాలన్నారు. ఈసందర్భంగా టీడీపీ నాయకులు ప్రభాకర్ చౌదరి, గౌసుపీరా, బొల్లుశ్రీనివాసులరెడ్డి, సంజీవ మాట్లాడుతూ గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో బడానాయకులు పలుకుబడిదారులు వ్యాపారవేత్తలు రాజకీయ వత్తిడితో పామిడి పంచాయతీని నగరపంచాయితీగా మార్చడంతో పేదలు పలు కష్టాలు నష్టాలను ఎదుర్కొంటున్నారని అప్పటి నుంచి ఇప్పటి వరకు అభివృద్ధి సూన్యమన్నారు. ఉపాధి పనులు లేక నిరుపేదలు వలసలుపోయారని,బ్రతుకు బారమై ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు కోకొల్లలని తిరిగి మన టీడీపీ ప్రభుత్వం రాగనే ఉపాధి హామీ పథకం అమలు చేయాలని మన గుంతకల్లు నియోజకవర్గ ఎంయల్ గుమ్మనూరు జయరాం కు ప్రతిపాదనలు చేయగా తప్పకుండా అమలు పరుస్తామని హామీ ఇచ్చిన ప్రకారం ఈరోజు వాటిని ప్రారంభించినందుకు అతనికి కృషికి ధన్యవాదాలు తెలుపుతూ పేదలు ఈపథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో యంపిడిఓ తేజోష్ణ ప్రభాకర్ చౌదరి, గౌసుపీరా జింకలసంజీవ,,మోహన్ కృష్ణ, రంగస్వామి శ్రీనివాసులు శివశంకర్, తేల్ బాషా, ఓబులకృష్ణ పత్ర శ్రీనివాసులు ఆర్మీ రఫీ,కుమార్, గోమాతి శంకర్ గోపాల్, గంపమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎయిడ్స్‌ను తరిమికొడదాం..

**విశాలాంధ్ర - బొమ్మనహాళ్ :** ప్రజలందరినీ చైతన్యవంతుల్ని చేసి ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మించుకోవాల్సిన భాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రీడ్స్ ప్రాజెక్టు మేనేజర్ మహేష్ తెలిపారు. బుధవారం మండల కేంద్రమైన బొమ్మనహాళ్ హైస్కూల్లో జిల్లా ఎయిడ్స్ నివారణ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మీకు తెలుసా అనే కార్యక్రమంలో భాగంగా హెచ్ఐవీ ఎయిడ్స్పై అవగాహన నదస్సు నిర్వహించారు. ముందుగా హెచ్ఐవీ ఎయిడ్స్ నివారణ పోస్టర్లును విడుదల చేశారు.ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు రవి,రీడ్స్ సిబ్బంది సావిత్రి,గంగమ్మ, ఎర్రిస్వామిలు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ

**విశాలాంధ్ర-ఉరవకొండ :** సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు వజ్రకరూరు మండల కేంద్రంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి తాసిల్దార్ నయాజ్ అహమ్మద్, వైద్య అధికారి తేజేశ్వరి, మలేరియా డివిజనల్ అధికారి బత్తుల కోదండరామిరెడ్డి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతోనే అనేక వ్యాధులను నియంత్రణ చేయొచ్చు అన్నారు. పారిశుధ్య నిర్వహణ చేస్తున్నప్పటికీ ప్రజలు కూడా చైతన్యవంతులై తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆమె సూచించారు.